1

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మెదక్

శనివారం | 30 నవంబర్ 2024 | www.navatelangana.com

రిజిస్ట్రేషన్ నిలిపివేయాలని వ్యక్తి ఆత్మహత్యాయత్నం



నవ తెలంగాణ-మద్దూరు : రిజిస్ట్రేషన్ నిలిపివేయాలని ఓ వ్యక్తి తహసిల్దార్ కార్యాలయంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సిద్దిపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. తహసిల్దార్ ఏజే రహీం తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లద్నూర్ గ్రామానికి చెందిన కాసర్ల రామస్వామికి ముగ్గురు కుమారులు బాల మల్లయ్య, శ్రీనివాస్, కనకరాజులు ఉన్నారు. రామస్వామి తన ఇద్దరు కుమారులు బాల మల్లయ్య, శ్రీనివాస్‌ల కుమారులు భాను, హరీష్‌లకు చెరో 32 గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు కార్యాలయానికి వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు. రామస్వామి మూడో కుమారుడు కనకరాజు వచ్చి రిజిస్ట్రేషన్ నిలిపివేయాలని కార్యాలయంలో పురుగుల మందుతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తహశీల్దార్ తెలిపారు. అనంతరం పట్టాదారు రామస్వామి స్టేట్మెంట్ తీసుకోగా తనకు ముగ్గురు కుమారులు ఉన్నారని, ముగ్గురు కుమారులకు భూమి చేస్తానని తెలపడంతో రిజిస్ట్రేషన్ నిలిపివేసినట్లు తహశీలాందక: తెలిపారు. ఆత్మహత్యయత్నానికి పాల్పడిన కనకరాజుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సై షేక్ మహబూబ్‌కు సూచించినట్లు ఆయన తెలిపారు.

పోలీస్ కిష్టయ్య వర్థంతిని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-జోగిపేట

తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ 15 వర్థంతి కార్యక్రమాలను రేపు(ఆదివారం) ఘనంగా నిర్వహించనున్నట్టు రాష్ట్ర ముదిరాజ్ మహాసభ పొలిట్ బ్యూరో సభ్యులు బి.నారాయణ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం జోగిపేటలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ అమరుడు పోలీస్ కిష్టయ్య వర్థంతి వేడుకలు చౌటకూర్ మండలం కోర్పోలు గ్రామంలో నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామంలో ముదిరాజ్ జెండా ఆవిష్కరణ చేసిన అనంతరం వర్థంతి సభ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ జ్ఞానేశ్వర్, రాష్ట్ర ముదిరాజు నాయకులు పులిమామిడి రాజు, నీలం మధు, సఫాన్ దేవ్, టప్ప కుమార్ తదితరులు హాజరవుతారన్నారు. డివిజన్లోని పోలీసు అధికారులకు కూడా సన్మాన కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి మెదక్ జిల్లాలోని ముదిరాజు బంధువులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కోర్పోల్ గ్రామ ముదిరాజు అధ్యక్షులు సుగుణయ్య తదితరులు ఉన్నారు.

సమాజాన్ని మార్చే సామాజిక వేత్తలుగా ఎదగాలి

మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

నవతెలంగాణ-సిద్ధిపేట



సమాజాన్ని మార్చే సామాజిక వేత్తలుగా ఎదగాలని, చదువుకు పేదరికం అడ్డు కావొద్దని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ప్రభుత్వ బాలికల పాఠశాలలో జరుగుతున్న జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను హరీశ్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పేద విద్యార్థులకు వైద్య విద్యకు ఆర్థిక సహాయాన్ని అందిస్తానని, ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు వచ్చిన విద్యార్థులకు ఫీజు తానే కడుతున్నాని అన్నారు. ఫీజు తన బాధ్యత... డాక్టర్ అయ్యేది మీ బాధ్యత అని భరోసా ఇచ్చారు. బాసర ట్రిబుల్ ఐటిలో సీటు సాధించిన విద్యార్థులకు ట్యాబ్ గిఫ్ట్ ఇస్తున్నానని, గత 5 సంవత్సరాల స్ఫూర్తితో పదిలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని ఉపాధ్యాయులకు సూచించారు. సైన్స్ పెయిర్‌లో రాష్ట్రంలో 1733 ప్రదర్శనలు చేసిన జిల్లాగా సిద్దిపేట నెంబర్ వన్ గా నిలిచిందని, చాలా సంతోషంగా ఉందని, సైన్స్‌ఫేర్‌లో విద్యార్థుల ప్రదర్శన ఎంతో చైతన్యం కలిగించాయన్నారు. ఒక్కొక్కరిలో ఒక్కో సైంటిస్టు కనబడుతున్నాడని, చాలా వరకు వ్యవసాయ ఆధారిన ప్రదర్శనలు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాత్రి పూట పొలం వద్ద కరెంట్ పోతే రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సాంకేతిక ఫర్టిలైజర్స్ ఉపయోగించే విధానం ప్రదర్శన చాలా బాగుందన్నారు. వరదలు వస్తే అలెర్ట్ చేసే అలారం.. సోలార్ విద్యుత్ వినియోగంపై మంచి ప్రదర్శన చేశారని విద్యార్థులను మెచ్చుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ప్రైవేట్ స్కూల్స్‌తో పోటీ పడుతున్నారని, విద్యార్థులు ఇంగ్లిష్‌లో మాట్లాడటం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు నేటి రోజుల్లో సోషల్ మీడియా, ఫోన్‌లు, డ్రగ్స్ వంటి వాటికీ బానిస అవుతున్నారని, అలాంటి వాటికీ దూరం ఉండి చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు.

100 రోజుల్లో 10 తరగతి పరీక్షలు ఉన్నాయని, ఇప్పటి నుండే టీవీలు, ఫంక్షన్స్‌లు, ఫోన్‌లు బంద్ చేయాలని, 10/10 సాధించిన విద్యార్థులకు మంచి బహుమతి ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హార్వెస్టర్‌ను ఢీకొని ఇద్దరు మృతి



నవతెలంగాణ-మెదక్ : హార్వెస్టర్‌ను ఢీకొని ఇద్దరు మృతి చెందిన సంఘటన మెదక్ మండలం మంబోజిపల్లి గ్రామ శివారులో గురువారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పేరూరు గ్రామానికి చెందిన గుండ్ల సాయిలు (47), తిప్పపురం వంశీ (25)లు బైకుపై గ్రామానికి వెళ్తుండగా రోడ్డుపై ఆగి ఉన్న వరి కోత యంత్రాన్ని ఢీకొట్టారు. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. రూరల్ ఎస్సై మురళి సంఘటన స్థలాన్ని సందర్శించారు.

ముఖ్యమైన చౌరస్తాల్లో ఆర్టీసీ బస్సులు ఆపాలి

నవతెలంగాణ-న్యాల్‌కల్



ముఖ్యమైన చౌరస్తాల్లో కూడా బస్సులు ఆపట్లేదని.. దాంతో ప్రయాణాలు చేసేటప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మిర్జాపూర్ (బి), గంగ్వార్ ముఖ్య చౌరస్తాల్లోనూ బస్సులు ఆపడం లేదని ఆరోపించారు. బస్‌స్టాప్ ఉన్నప్పటికీ ఎందుకు ఆపడం లేదని ప్రశ్నిస్తున్నారు. జహీరాబాద్-బీదర్ ప్రధాన రోడ్డు కావడం, మిర్జాపూర్ (బి) ప్రభుత్వ ఆసుపత్రి, పీజీ కాలేజ్, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆఫీసులు ఉండడంతో చాలా మంది ఈ రూట్‌లలో ప్రయాణాలు సాగిస్తున్నారు. అయితే ముఖ్యమైన చౌరస్తాల్లో కూడా బస్సులు ఆపకపోవడంతో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు సమయానికి పాఠశాలకు వెళ్లలేకపోతు న్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి.. చౌరస్తాల్లో బస్ ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పరీక్ష ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-నర్సాపూర్



నర్సాపూర్ సమీపంలోని బి.వి.ఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జరుగనున్న మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డ్ ఆఫ్ ఫార్మసిస్ట్ గ్రేడ్ టు పరీక్షల ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. ఆర్డీవో మహిపాల్, తహశీల్దార్ శ్రీనివాస్, జిల్లా అధికారులు సైతం సందర్శించి ఈ పరీక్ష ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లను పక్కాగా చేయాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం కులగణన సామాజిక సర్వేలో భాగంగా డాటా ఎంట్రీని సైతం వారు పరిశీలించి, డాటా ఎంట్రీలో ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు.

జహీరాబాద్‌లో ట్రెయినీ కలెక్టర్ల విస్తృత పర్యటన



నవతెలంగాణ-జహీరాబాద్

ట్రెయినీ ఐఏఎస్‌లు చేతన్ కుమార్, స్వాతి, సందీప్, స్వాతి, గుప్తా లు జహీరాబాద్ పట్టణంలో శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. వివిధ ప్రాంతాలను కలియతిరగి ఆయా శాఖల ద్వా రా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం ప్రజా సంక్షే మం కోసం తీసుకోవాల్సిన కార్యక్రమాల గురించి వివిధ సంఘాలతో మాట్లా డారు. పలు పరిశ్రమల వద్దకు వెళ్లి కార్మికులు చేపడుతున్న కార్యక్రమాలు, ఉత్పత్తి రంగంలో వారికి ఇస్తున్న వేతనాల గురించి అడిగి తెలుసుకున్నారు.

శిథిలావస్థకు రాంతీర్థం పంచాయతీ భవనం

నవతెలంగాణ-న్యాల్‌కల్



మండలంలోని రాంతీర్థం గ్రామ పంచాయతీ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. మండల అధికారుల పర్యవేక్షణాలోపం వల్ల గ్రామ పంచాయతీ పాలన అస్తవ్యస్తంగా మారింది. నూతన పంచాయతీ భవనాన్ని ఎప్పుడు నిర్మిస్తారో అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. 880 మంది ఓటర్లు ఉన్నప్పటికీ కనీసం గ్రామ పంచాయతీ భవనం లేకపోవడంతో సభలు, సమావేశాలు నిర్వహించడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై పంచాయతి కార్యదర్శి కృష్ణ ప్రతాప్‌రెడ్డి వివరణ కోరగా.. పంచాయతీ భవనం డీఎంఎఫ్‌టీ నిధుల కింద రూ.15 లక్షలు మంజూరయ్యాయి. కానీ పనులు ప్రారంభం కాలేదన్నారు.

దీక్ష దివస్‌కు తరలిన బీఆర్ఎస్ నేతలు

నవతెలంగాణ-జిన్నారం



జిన్నారం ఉమ్మడి మండలం బీఆర్ఎస్ సంగారెడ్డి జిల్లా దీక్ష దివస్ కార్యక్రమానికి బీఆర్ఎస్‌లో భారీగా తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ రాష్ట్ర నేత జిన్నారం వెంకటేష్ గౌడ్, రాష్ట్ర నాయకులలు సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, నాయకులు సురేందర్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, శివరాజ్,గణేష్,కృష్ణ, పరమేష్ రెడ్డి, శాంతవర్మ రెడ్డి, బల్‌బీర్‌సింగ్, దేవేందర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యా సంస్థల్లో ఫుడ్ పాయిజన్ జరగకుండా చర్యలు



- విద్యార్థుల విషయంలో రాజకీయమా..!
- పొరపాట్లను సవరిస్తాం..
- మెస్ కాస్మెటిక్ చార్జీలు పెంచాం
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ-కొండపాక

గురుకుల విద్యాలయాలు, సంక్షేమ వసతి గృహాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కొండపాకలో వందల చరిత్ర కలిగిన రుద్రేశ్వరాలయంలో మాస శివరాత్రి సందర్భంగా పూజలు చేసిన అనంతరం సీనియర్ కాంగ్రెస్ నాయకులు రుద్రేశ్వరాలయ ట్రస్ట్ చైర్మెన్ ఇంట్లో విలేకరులతో మంత్రి మాట్లాడుతూ గురుకులాల్లో, ప్రభుత్వ హాస్టల్‌లలో ఎక్కడో ఒకచోట ఫుడ్ పాయిజన్ జరిగితే దాన్ని పెద్ద అంశంగా మార్చి రాద్ధాంతం చేయడం సరైనది కాదన్నారు. విద్యార్థులకు సంభందించిన ఈ అంశాన్ని రాజకీయం చేయవద్దని రాజకీయపక్షాలకు విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా పొరపాట్లు జరిగితే బలహీనవర్గాల మంత్రిగా వాటన్నిటిని సవరించే ప్రయత్నం చేస్తున్నాన్నారు. ఎక్కడైనా పొరపాట్లు జరుగుతున్నట్లు అనిపిస్తే మంత్రికి గానీ అధికారులు దృష్టికి తీసుకుపోవాలి కానీ రాద్ధాంతం చేయకూడదన్నారు. ఈ విషయంలో రాద్ధాంతం చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు.

మెస్ చార్జీలు పెంచాం

మెస్ చార్జీలు కాస్మోటిక్ చార్జీలు పెంచినం, టీచర్ల నియామకం చేసినం, అద్దె భవనాల చార్జీలు చెల్లించినం, అన్ని హాస్టల్ లలో, గురుకుల విద్యాలయాల్లో ఈజీఎస్ ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దెందుకు, ప్లాంటేషన్ కోసం ఆదేశాలు జారి జారీచేసినామని తెలిపారు. అయినా కూడా ఎక్కడైనా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో అపరిశుభ్రత, భోజన సదుపాయల్లో ఏదైనా అశ్రద్ధతో సంఘటనలు జరిగితే సమీక్షించి సంబంధిత అధికారులు, వార్డెన్‌ల పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పొరపాట్లు జరగకుండా అవసరమైన చోట వంట సంబంధిత వారిని మార్చుకోవాలని, మెనూ చేంజ్ చేసుకోవాలని తెలిపారు. పెండింగ్ బకాయిలను వెంటనే ఇచ్చే విధంగా గ్రీన్ ఛానల్ ద్వారా వ్యవస్థ నడుస్తుందన్నారు. జిల్లాలోని అధికారులు, ప్రజాప్రతినిధులు హాస్టళ్ళు సందర్శించి సమస్యలను తీర్చాలని సూచించారు. ఎక్కడైనా సమస్య గుర్తించి నా దృష్టికి తీసుకు వస్తే నేను వచ్చి పరిష్కరించేందుకు బాధ్యత తీసుకుంటానాని ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు తెలిపారు.

రుద్రేశ్వరాలయ అభివృద్ధికి కృషి

దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన మంత్రి

వందల ఏండ్ల చరిత్ర కలిగిన రుద్రేశ్వరాలయ అభివృద్ధికి ప్రభుత్వ పక్షాన నిధుల మంజూరుకు కృషి చేస్తానని బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. దేవాలయంలో శుక్రవారం మాస శివరాత్రి సందర్భంగా మాజీ మంత్రి సీనియర్ కాంగ్రెస్ నాయకులు దివంగత మదన్ మోహన్ కుమార్తె అనుపమ అశోక్ నాయుడు శత రుద్రాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొని రుద్రేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ట్రస్ట్ కార్యదర్శి వెంకటరమణ శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. దేవాలయ చరిత్ర ప్రాశస్త్యాన్ని మంత్రికి వెంకటరమణ శర్మ వివరించారు. దేవాలయంలో కావాల్సిన వసతుల గురించి మంత్రి దృష్టి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రిని ఆలయ మర్యాదలతో సత్కరించారు. ముందుగా వేద పండితులు పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలికారు. దేవాలయ ఆవరణలో మంత్రి మొక్క నాటారు. అనంతరం గ్రామంలోని అనంతల మదన్ మోహన్ విగ్రహానికి, ఇందిరాగాంధీ విగ్రహానికి మంత్రి పొన్నం ప్రభాకర్ పూలమాల వేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, డీపీఓ దేవకీదేవి డీఈవో శ్రీనివాస్ రెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి, డీసీసీబీ చైర్మెన్ చిట్టి దేవేందర్ రెడ్డి, మడుపు భూమి రెడ్డి, రుద్రేశ్వరాలయ ట్రస్టు చైర్మెన్ అనంతల శ్యామ్ మోహన్ ట్రస్ట్ సభ్యులు ఆర్ బాలయ్య, మాజీ సర్పంచ్ చిట్టి మాధురి, మంచాల కనక రాములు, కాంగ్రెస్ పార్టీ కొండపాక ,కుకునూరు పల్లి మండలాల అధ్యక్షులు వాసవి లింగారావు, శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ దిలీప్ నాయక్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ట్రాన్స్ కో ఎస్ ఈ శ్రీనివాస్ రెడ్డి, ఏఈ సత్యం తదితరులు ఉన్నారు.

క్రమశిక్షణ, నిబద్ధతతకు మారుపేరు పోలీసు ఉద్యోగం

- సంవత్సర కాలంలోనే 50 వేల పైచీలుకు ఉద్యోగాలు
- వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకోండి
- టీజీఎస్పీఎఫ్ 2024 బ్యాచ్ పాసింగ్ పరేడ్‌లో మంత్రి శ్రీధర్ బాబు





నవతెలంగాణ-అమీన్‌పూర్

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే 50 వేల పైచీలుకు ఉద్యోగాలను కల్పించిందని ఐటీ మంత్రి డి.శ్రీధర్ బాబు పేర్కొన్నారు. సగటున ప్రతి నెలకు 5 వేల జాబ్‌లను కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తోందన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పరిధిలోని తెలంగాణ స్పెషల్ ప్రొటక్షన్ ఫోర్స్ అకాడమీలో జరిగిన పోలీస్ పాసింగ్ పరేడ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2024 బ్యాచ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 265 మంది కానిస్టేబుళ్లకు ఈ సందర్భంగా ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. పాసింగ్ పరేడ్ అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ తెలంగాణలో పారదర్శక పాలన కొనసాగుతోందన్నారు. ఇచ్చిన హామీలన్నింటినీ రేవంత్ సర్కార్ నెరవేరుస్తోందని, ఇప్పటి వరకు 50 వేల జాబ్స్ కల్పించి మాట నిలబెట్టుకున్నామని చెప్పారు. ఎంతో కష్టపడి పోలీస్ జాబ్ తెచ్చుకున్న కానిస్టేబుళ్లకు రాష్ట్రానికి, దేశానికి సేవ సేచే అవకాశం దక్కిందని.. దానిని ఉపయోగించుకోవాలని శిక్షణ పూర్తి చేసుకున్న పోలీసులకు మంత్రి సూచించారు. క్రమశిక్షణ, నిబద్ధతతకు పోలీస్ వృత్తి మారుపేరని రాష్ట్ర ప్రగతిని, భద్రతను కాపాడే గొప్ప అవకాశం పోలీసుల చేతుల్లోనే ఉందన్నారు. ఈ పాసింగ్ పరేడ్ మీ జీవితాల్లో మరిచిపోలేని రోజుగా మిగిలిపోతుందని, మీరు కన్న కలలు సాకారం చేసుకొని రక్షకులుగా మారిన క్షణాలను అందరూ భద్రపరుకోవాలని.. తెలంగాణ రాష్ట్రానికి ఇది ఎంతో ముఖ్యమైన రోజని మంత్రి శ్రీధర్ బాబు వాఖ్యానించారు. క్రమశిక్షణతో రాష్ట్రానికి సేవలు అందిస్తే చాలని, వారికి ప్రభుత్వం అండగా నిలబడుతుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎఫ్ డీఐజీ, అకాడమీ ప్రిన్సిపల్ మాధవరావు, డీజీపీ అనీల్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ క్రిష్ణయ్య, సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేశ్, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ సత్తయ్య, తహసీల్దార్ రాధా, ఎస్పీఎఫ్ అధికారులు శ్రీధర్ రెడ్డి, నరేశ్, సీహెచ్ నరేశ్, సురేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

టీజీఎస్పీఎఫ్ శిక్షణ భేష్

స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో పోలీసులకు అందించే శిక్షణను మంత్రి శ్రీధర్ బాబు కొనియాడారు. మౌళిక విలువలతో కూడిన శిక్షణతో వారు బయటకు వస్తున్నారని అభినందించారు. రక్షణ నైపుణ్య ప్రమాణాలను, టీం వర్క్‌తో నేర్చుకున్న పోలీసులు రాష్ట్ర గౌరవాన్ని కాపాడే సేవకులుగా తయారవుతున్నారన్నారు. ఎస్పీఎఫ్ అభివృద్ధికి అన్ని రకాల సహాయ సహకారాలు ఉంటాయని మంత్రి హామీ ఇచ్చారు. భద్రతా పురోగతి విషయాలను ప్రభుత్వం ఎల్లప్పుడు ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు.

నాటి ఉద్యమ స్ఫూర్తితో ప్రభుత్వంపై పోరాటం

- కేసీఆర్ లేకుంటే తెలంగాణ లేదు
- సిద్దిపేటలో 1531 రోజులు దీక్ష చేశాం
- రంగదాంపల్లి దీక్ష దివాస్ మరువలేనిది
- దీక్ష దివాస్ లో మాజీ మంత్రి హరీష్ రావు





నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

ఆనాటి ఉద్యమ జ్ఞాపకాలు మరువలేనివని నాటి ఉద్యమ స్ఫూర్తితో నేటి ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. దీక్ష దివాస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సిద్దిపేటలోని బీఆర్ఎస్ జిల్లా భవన్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించి అనంతరం మాట్లాడారు. అంతకుముందు రంగాధాంపల్లి అమరవీరుల స్థూపానికి నివాళి అర్పించారు. 2001 ఉద్యమ సమయంలో నుంచి తెలంగాణ కోసం అనేక పార్టీలతో పొత్తు పెట్టుకున్న ప్రతి పార్టీ తెలంగాణ ప్రజలను మోసం చేసిందని గుర్తు చేశారు. ఈ క్రమంలోనే ఏ పార్టీని నమ్మకుండా పోరాటాలకు సిద్ధమైనట్టు తెలిపారు. సిద్దిపేటలో ఉద్యోగ గర్జన కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని, 2009 అక్టోబర్‌లో సిద్దిపేటలో అంబేద్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో కేసీఆర్ హాజరై మాట్లాడుతూ తెలంగాణ వచ్చుడో కేసీఆర్ చచ్చుడో ..తెలంగాణ జైత్రయాత్రనా.. లేదా కేసిఆర్ శవయాత్రన అనే మాటలను ఆనాడే కేసీఆర్ సిద్దిపేటలో చెప్పారని హరీష్ రావు గుర్తు చేశారు. ఆ సమయంలో ఉద్యోగ గర్జన పెద్ద ఎత్తున విజయవంతమైందన్నారు. తర్వాత 2009 నవంబర్ 29లో ఆమరణ దీక్షకు సిద్దిపేట కేంద్రంగా కేసిఆర్ పిలుపునిచ్చాడని తెలిపారు. ఆ సమయంలో సిద్దిపేట ప్రాంతమంతా పోలీసులతో నిండిపోయిందని కేసీఆర్‌ను మార్గమధ్యమంలో అరెస్టు చేసిన సిద్దిపేటలో ఉద్యమ దీక్ష ఆగలేదన్నారు. కేసీఆర్ జైల్లో దీక్ష కొనసాగిస్తే తాము సిద్దిపేటలో దీక్ష కొనసాగించామన్నారు. ఈ దీక్షతో దిగొచ్చిన ఢిల్లీ ప్రభుత్వం తెలంగాణ ప్రక్రియను ప్రారంభిస్తామని చెప్పి అతి త్వరలోనే మళ్లీ మాట మార్చిందన్నారు. అప్పుడు తెలంగాణలో మలిదశ ఉద్యమం ప్రారంభమై సిద్దిపేటలో 1531 రోజులు దీక్ష చేశామని గుర్తు చేశారు. ఆనాడు దీక్షలో పాల్గొన్న ఉద్యమకారులను అందరినీ పేరుపేరునా గుర్తు చేసుకున్నారు. గాంధీ మార్గంలో నిరాహార దీక్షకు కేసిఆర్ పూనుకొని ఆమరణ నిరాహార దీక్షతో ఢిల్లీ పెద్దలను కదిలించారని కదిలించారన్నారు. ఆనాటి ఉద్యమ సమయంలో రాజీనామాలు చేయమంటే నేటి సీఎం రేవంత్ రెడ్డి బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి పారిపోయారన్నారు. కేసీఆర్ చరిత్రను కీర్తిని తుడిచి వేయడం ఎవరి వల్ల కాదని తెలంగాణ అంటేనే కేసీఆర్ అని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తుందని నాటి ఉద్యమ స్ఫూర్తితో బీఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు ప్రజలు నడుము కట్టి ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు. రాబోయే రోజులలో ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్సి యాదవ రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డిలు మాట్లాడగా, బీఆర్ఎస్ నాయకులు వంటేరు ప్రతాపరెడ్డి, రాష్ట్ర నాయకులు రాధాకృష్ణ శర్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, సుడా మాజీ చైర్మన్ రవీందర్ రెడ్డి, నాయకులు బాల్ రంగం, భూపతి రెడ్డి, జిల్లా ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు మహిళ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గీతంలో 'ప్రాజెక్టు ఎక్స్ పో'



నవతెలంగాణ-పటాన్‌చెరు

గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఇంజనీరింగ్ తొలి ఏడాది విద్యారుల్లో నిబిడీకృతంగా ఉన్న అసాధారణ సృజనాత్మకత, ఇంజనీరింగ్ నైపుణ్యాలను వెలికితీసేలా శుక్రవారం 'ప్రాజెక్టు ఎక్స్ పో'ను నిర్వహించారు. టెక్నాలజీ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ ప్రొడక్ట్ ఇంజనీరింగ్ (టీపీఈ) లాబొరేటరీలో ఏర్పాటు చేసిన ఈ ఒకరోజు పోటీలో దాదాపు పది సాంకేతిక బృందాలు తమ వినూత్న ప్రతిభను ప్రదర్శించాయి. కాయిన్ ఆధారిత మొబైల్ ఛార్జింగ్ పరికరం (అంటే ఛార్జర్ లేకపోయినా బజారులో కాయిన్ వేసి ఛార్జింగ్ చేసుకునేలా), వేలిముద్ర ఆధారిత ఓటింగ్ యంత్రం (అంటే దొంగ ఓట్లు, రిగ్గింగ్‌లకు తావులేకుండా), మోపింగ్ రోబోట్, లైన్ ఫాలోయింగ్ రోబోట్, లైట్ సీకింగ్ రోబోట్, స్మార్ట్ బ్లైండ్ స్టిక్, రోబోటిక్ ఆర్మ్, పొగను గుర్తించే పరికరం, ఆటోమేటెడ్ వాక్యూమ్ క్లీనర్ వంటి ప్రాజెక్టులను తొలి ఏడాది ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రదర్శించారు. గీతం పూర్వ విద్యార్థి, జీరో మొబైల్ వ్యవస్థాప కుడు విజయ్, ఆయన సహ వ్యవస్థాపకులు మరో ఇద్దరితో కలిసి ఈ ప్రదర్శనలో ఉంచిన పదింటిలో మూడు ప్రాజెక్టులను విజేతలుగా ఎంపిక చేశారు. 'అత్యాధునిక ల్యాబ్ లను నెలకొల్పి విద్యార్థులకు అభ్యాసంతో కూడిన విద్యను గీతం అందించడమే గాక, వారిలో పరిశోధనాత్మక దృక్పథాన్ని పెంపొందించడం గర్వకారణమని' విజయ్ వ్యాఖ్యానించారు. విద్యార్థులను ఆవిష్కరణల వైపు పురిగొల్పడం గీతం నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షత వహించిన ప్రొఫెసర్ పున్నా ఈశ్వరయ్య మాట్లాడుతూ.. 'టీపీఈ ల్యాబ్ లక్ష్యం విద్యార్థి కెరీర్ ప్రారంభ దశలోనే సాంకేతిక అంశాలను పరిచయం చేయడం. ఉత్పత్తులను సాధించడానికి తొలి ఏడాది బీటెక్ విద్యార్థులను ప్రేరేపిస్తున్నాం. వారు ఒక కాన్సెప్ట్ తో ముందుకొచ్చి, దాని కార్యాచరణను ప్రదర్శించి 'దానికి ఉత్పత్తిని రూపొందించాలి' అని వివరించారు. ముగ్గురు న్యాయ నిర్ణేతలతో కూడిన వ్యవస్థాపకుల ప్యానెల్, గూగుల్, అమెజాన్ వంటి సంస్థలలో వారు సమకూర్చుకున్న అనుభవంతో ప్రతీ ప్రదర్శనను నిశితంగా పరిశీలించి, వాటిని మెరుగుపరచడానికి తగిన సూచనలు, సలహాలను అందజేశారు.విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేసి, వారు మరిన్ని ప్రాజెక్టులు చేపట్టేలా ప్రోత్సహించారు.

హైవేపై అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు

- డివైడర్‌ను ఢీకొని.. దానిపైనే కొంతదూరం వరకు లాక్కెళ్లిన వైనం
- 25 మందికి స్వల్ప గాయాలు
- తప్పిన పెను ప్రమాదం
- అందోల్ మండలం కన్‌సాన్‌పల్లి వద్ద ఘటన





నవతెలంగాణ-జోగిపేట

సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం కన్‌సాన్‌పల్లి వద్ద 161 జాతీయ రహదారిపై శుక్రవారం రోజున ఆర్టీసీ బస్సు అదుపు తప్పింది. నారాయణ ఖేడ్ నుంచి జోగిపేట వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు కన్‌సాన్‌పల్లి వద్ద అదుపు తప్పి.. జాతీయ రహదారిపై ఉన్న డివైడర్‌ను స్పీడ్‌గా ఢీకొట్టి డివైడర్ పైకి ఎక్కి కొంతదూరం వరకు దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో బస్సులో సుమారుగా 50 మందికి పైగా ఉన్నారు. వారిలో 25 మంది వరకు గాయాలు స్వల్ప గాయా లయ్యాయి. వారిలో హనుమంతరావుపేటకు చెందిన అంబాదాస్‌కు తలకు గాయాలవ్వగా.. గడి పెద్దాపూ ర్‌కు చెందిన సుజాత కాలు విరిగింది. ఆమె కొడుకు అనిల్ చేయి విరిగింది. మంజుల, ముకుందరావు, అంజమ్మ, లావ ణ్య హనుమంతు, శ్యామల, తనుశ్రీ, మమత, బుజ్జి బాయి, ఏసమ్మ, సాయమ్మ, నారాయణరావు, బోధమ్మ సీతమ్మ జ్యోతి, సత్యమ్మ కండక్టర్ శంకరయ్యలతో పాటు మరికొంత మంది స్వల్పగాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. గాయపడిన వారిని నాలుగు 108 అంబులెన్స్ ద్వారా జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. వైద్యులు నాగలక్ష్మి, నాగరాజులు చికిత్సలు చేశారు. డ్రైవర్ ఎంఎస్ఎల్ఎస్ స్వామికి చాతిలో దెబ్బ తగలడంతో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న జోగిపేట ఎస్ఐ పాండు ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసు కున్నారు.డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా నడపడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులు చెబుతున్నారు.ఖేడ్ ఎమ్మెల్యే సోదరుడు శేఖర్‌రెడ్డి జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి గాయపడిని వారిని పరామర్శించారు. వారి పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెల్సుకున్నారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమా?



నవతెలంగాణ-సంగారెడ్డి

నాణ్యతలేని ఆహార పదార్థాల వల్ల విద్యార్థులు అనారోగ్యాల పాలవుతున్నారని.. సరైన ఆహార పదార్థలు పెట్టకుడా విద్యార్థుల ప్రాణలతో చెలగాటం ఆడుతున్నారా? అని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు సందీప్ ప్రశ్నించారు. ఈ మేరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్డీవో ఆఫీస్ ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించి.. ఆర్డీవో రవీందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ గురుకుల హాస్టల్‌లో నాణ్యమైన భోజనం అందక విద్యార్థులు అల్లకల్లోలం అవుతున్నారన్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టకుండా విద్యార్థుల ప్రాణాలతో వార్డెన్‌లు చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. రోజురోజుకూ హాస్టల్లో మరణాల రేటు పెరుగుతున్నా పట్టించుకోని ప్రభుత్వాధికారులు ఎందుకు అని దుయ్యబట్టారు. సంక్షేమ గురుకుల హాస్టల్‌లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పిం చకుండా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని మండిప డ్డారు. సంక్షేమ హాస్టల్లో సమస్యల పరిష్కారానికి పీడీఎ స్‌యూ ఆధ్వర్యంలో నేడు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశా లల బంద్ పిలుపును ప్రకటిస్తున్నామన్నారు. ఈ బంద్‌కు విద్యార్థులు మేధావులు, విద్యావేత్తలు మద్దతు ప్రకటించి జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బన్నీ, సిద్దేశ్వర్, శ్రీకాంత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఝరాసంగం సొసైటీలో రైతు పండుగ ప్రదర్శనలు



నవతెలంగాణ-ఝరాసంగం

మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రైతు పండగ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ ప్రదర్శనలు నిర్వహించారు. నేడు మహబుబ్‌నగర్ జిల్లాలోని అమిస్తాపూర్‌లో నిర్వహించనున్న రైతు మహా సదస్సును విజయవంతం చేయాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గౌసొద్దిన్, సీఈఓ నిసార్ హైమద్, సొసైటీ డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

టెలికాన్ఫరెన్స్‌లో రైతులు పాల్గొనాలి..

రైతుల పండుగ సందర్భంగా మహబుబ్‌నగర్ జిల్లాలోని అమిస్తాపూర్‌లో నిర్వహిస్తున్న రైతు మహాసదస్సు కార్యక్రమాన్ని నేడు మండల పరిధిలోని బర్దిపూర్ రైతు వేదికలో టెలికాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయఅధికారి వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రైతులు పాల్గొనాలన్నారు.

సమిష్టి కృషితోనే జాతీయ అవార్డు

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రికి ఉత్తమ సేవల్లో అవార్డు రావడం పట్ల హర్షం

వైద్యులు, వైద్య సిబ్బందికి ఘన సన్మానం



నవతెలంగాణ-పటాన్‌చెరు

ఆసియాలోని అతిపెద్ద పారిశ్రామిక వాడగా చెందిన పటాన్‌చెరు నియోజకవర్గ కేంద్రంలోని టంగుటూరి అంజయ్య ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి ఉత్తమ సేవలు విభాగంలో జాతీయ స్థాయిలో ఏడో స్థాయి అవార్డు రావడం సమిష్టి కృషి మూలంగానే సాధ్యమైం దని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖ సెంట్రల్ క్వాలిటీ సూపర్వైజర్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ సమీక్షలో మొదటి ప్రయత్నంలోనే జాతీయ స్థాయిలో 7వ స్థానం సాధించింది. ఈ నేపథ్యంలో పట్టణంలోని ఆస్పత్రి ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అవార్డు రావడానికి కృషి చేసిన వైద్యులు, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 20 ఏండ్ల క్రితం అప్పటి సీఎం దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో ఏరియా ఆసుపత్రికి జీవోని మం జూరు చేసినట్టు గుర్తు చేశారు. 2012లో ఆసుపత్రి ప్రారం భించిన నాటి నుంచి నేటి వరకు నాణ్యమైన సేవలు అంది స్తూ ప్రజలందరి మనల్ని పొందుతోందన్నారు. గత దశాబ్ది కాలంలో ఆసుపత్రికి అవసరమైన ఆక్సిజన్ ప్లాంట్లు, ఆపరేషన్ థియేటర్లు, జనరేటర్లను ఏర్పాటు చేయడంతో పాటు సిఎస్సార్ నిధులతో వివిధ సౌకర్యాలు కల్పించినట్టు చెప్పారు. మొదటి ప్రయత్నంలోనే జాతీయ స్థాయిలో ఏడో స్థానం దక్కడం నియోజక వర్గంలోని ప్రతి ఒక్కరికి గర్వకా రణమన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని అవార్డులు సాధిం చాలని అభిలాషించారు. ఆసుపత్రి అభివృద్ధికి సంపూర్ణ సహకార అందిస్తున్నామన్నారు. రూ.350 కోట్ల అంచనా వ్యయంతో పటాన్‌చెరులో చేపడుతున్న సూపర్ స్పెషాలిటీ ఆసు పత్రి పనులు శరవేగంగా కొనసాగుతున్నా యన్నారు. త్వరలోనే ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయను న్నట్లు చెప్పారు. కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్న పటాన్ చెరు ప్రభుత్వ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. త్వరలోనే డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత సోమిరెడ్డి, వైస్ చైర్మన్ రాములు గౌడ్, రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేష్, మాజీ జెడ్పి వైస్ చైర్మన్ ప్రభాకర్, జిల్లా వైద్యాధికారిని గాయత్రీ, డీసీహెచ్ఎస్ అధికారి సంగారెడ్డి, మాజీ జెడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ కోసం వినతి పత్రం



నవతెలంగాణ-సదాశివపేట

టీజీఐఐసీ చైర్మెన్ నిర్మల జయప్రకాశ్‌రెడ్డిని సదాశివపేట పట్టణ పద్మశాలి సంఘం సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి.. పట్టణంలోని శివశక్తి లాడ్జి పక్కన దుర్గమ్మ మందిరానికి వెళ్లే కందకం రోడ్డు జంక్షన్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. ఇందుకు ఆమె సానుకూలంగా స్పందించి.. సాధ్యమైనంత త్వరలో జరిగేట ట్టు చూస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలీ అధ్యక్షులు మునిపల్లి విశ్వనాథం, ప్రధాన కార్యదర్శి నక్క ప్రభాకర్ (పప్పి), గున్నాల సంజీవ్, బిట్ల ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భవిష్యనిధి 73వ వార్షికోత్సవం



నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్‌చెరులోని ఈపీఎఫ్ కార్యాలయం ఆధ్వర్యంలో భవిష్యనిధి 73వ వార్షిక దినోత్సవాలను బీహెచ్ఈఎల్ కమ్యూనిటీ సెంటర్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దాంతో పాటు, హిందీ పక్వాడ, స్వచ్ఛత పక్వాడ, విజిలన్స్ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రాంతీయ భవిష్యనిధి కమీషనర్-1,విశాల్ అగర్వాల్ మాట్లాడుతూ.. హిందీ ప్రాముఖ్యత, విజిలెన్స్ ప్రాధాన్యతలతో పాటు ఈపీఎఫ్ఓ యొక్క విశిష్టత గురించి వివరించారు. హిందీ పక్వాడకి సంబంధించి నిర్వహించిన వివిధ కార్యక్రమాలు, పోటీల గురించి నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. 'ఎంప్లాయి అఫ్ ది ఇయర్' అవార్డును హర్షవర్ధన్ కి, స్పెషల్ అవార్డు తబితాకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ భవిష్యనిధి కమీషనర్-2, ఆర్.శ్రీదేవి, అసిస్టెంట్ పీఎఫ్ కమీషనర్ రామకృష్ణ, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ఝరాసంగంలో ఎంపీ పర్యటన

-పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

నవతెలంగాణ-ఝరాసంగం

ఝరాసంగం మండలంలో నేడు (శనివారం) జహీరాబాద్ లోకసభ సభ్యులు సురేష్ కుమార్‌షెట్కర్ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్టు శుక్రవారం అధికారులు వెల్లడించారు. మండల పరిధిలోని ప్యారవరంలో సీఆర్ఆర్ నిధుల కింద రూ.3 కోట్ల వ్యయంతో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అంతేకాకుండా మండలకేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సముదాయాల్లో మహిళాశక్తి క్యాంటీన్‌ను ప్రారంభించనున్నారు.

రైతులు ప్రజాపాలన విజయోత్సవాలకు పాల్గొనాలి

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని ముంగి రైతు వేదికలో నేడు (శనివారం) 2 గంటలకు రైతు పండుగ కార్యక్రమం లైవ్ ప్రోగ్రాం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి అభినాష్ వర్మ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. రైతు పండుగ రుణమాఫీ ఆధునిక సాంకేతిక పద్ధతుల గురించి లైవ్ ప్రోగ్రాంలో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని తెలిపారు.

వాగును ఆక్రమిస్తున్న వెంచర్లపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-సదాశివపేట

మండల పరిధిలోని వెల్టూరు గ్రామ శివారులో వెలసిన శుభ గృహ, యోషిత ఇన్ఫ్రా, జె గ్రూప్ వెంచర్ల మధ్యలో గల సర్వేనెంబర్ 421, 425, 426, 427,435,436 నుంచి సోటా వాగు ప్రవహిస్తున్నది. అయితే పలు వెంచర్ల యాజమాన్యులు వారి స్వలాభం కోసం వెంచర్ మధ్యలో ఉన్న వాగును దారి మళ్లిస్తున్నన్నారని పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దానివల్ల భవిష్యత్తులో శివారులోని భూముల్లో పంట నష్టపోయే ప్రమాదం ఉన్నదని, దీనిపై వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సరస్వతి, అదేవిధంగా ఇరిగేషన్ అధికారికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు వెంకటేశం, బాల్లయ్య,మల్లేశం, రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి నిరంతరం కృషి



నవతెలంగాణ-న్యాల్‌కల్

రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నదని జహీరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ మెటల్ కుంట తిరుపతిరెడ్డి అన్నారు. రైతు సంబరాల్లో భాగంగా గురువారం మెటల్‌కుంట గ్రామంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు 2023/ 2024 గాను రూ.2.23 కోట్ల మార్కెట్ ఆదాయం టార్గెట్ చేసుకోగా.. రూ.5 కోట్ల 13 లక్షల 45 వేల రూపాయలు వచ్చిందన్నారు. 2024/2025 గాను రూ.3 కోట్లు ఆదాయం టార్గెట్ చేసుకోగా రూ.3 కోట్ల 28 లక్షల వ్యవసాయ మార్కెట్ ఆదాయం వచ్చిందన్నారు.

ప్రత్యేక బోధనను పరిశీలించిన ఎంఈఓ దశరథ్



నవతెలంగాణ-కొండాపూర్

మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక బోధనను ఎంఈఓ దశరథ్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. పరీక్షలు సమీపిస్తున్నాయి కాబట్టి సమయాన్ని వృథా చేయకుండా. ప్రతిరోజు సాయంత్రం, ఉదయం ఇష్టపడి చదివి 100శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని, తాము అనుకున్న గమ్యస్థానానికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు సంగమేశ్వర, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్‌కు కృతజ్ఞతలు



నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రంలోని స్థానిక ఎస్సీ వాడలో పోచమ్మ ఆలయం నిర్మాణ క్రమంలో భాగంగా స్లాబ్ వేయించినందుకు మండల పరిషత్ మాజీ అధ్యక్షులు దమ్మగౌని రవీందర్ గౌడ్‌కు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజలు శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ నిర్మాణానికి సంబంధించి అడగ్గానే పెద్ద మనసుతో ప్రత్యేకంగా సహకరించారని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మాజీ ఎంపీటీసీ కోరబోయిన లావణ్య నరేష్, జిన్నారం మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు యనగండ్ల నరేందర్ గౌడ్, ఎర్రవాలి బాలు, రవి, బృందం కృతజ్ఞతలు తెలిపారు.

ఛలో హైదరాబాద్ వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ



నవతెలంగాణ-హత్నూర

హైదరాబాదులో జరిగే 'హలో మాల.. ఛలో హైదరాబాద్' సింహగర్జన సభ విజయవంతం చేయాలని దౌల్తాబాద్‌లో వాల్ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు బక్కన్న మాట్లాడుతూ.. మాలల హక్కులను సాధించేవరకు ఊరుకునేది లేదన్నారు. డిసెంబర్ 1న మాలల సింహగర్జనకు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హలో మాల ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పుండరీకం, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, మాల మహానడు సీనియర్ నాయకులు శాంత కుమార్, కిష్టయ్య, మాల మహానాడు మండల అధ్యక్షులు పలంచ రాజీవ్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

దీక్ష దివస్‌కు బయలుదేరిన బీఆర్ఎస్ శ్రేణులు



నవతెలంగాణ-సదాశివపేట

బీఆర్ఎస్ మండల శ్రేణులు దీక్ష దివస్ సందర్భంగా సంగారెడ్డికి బయలుదేరి వెళ్లారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శన మరియు వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మండలం నుండి సుమారు 150 మంది కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తొంట యాదమ్మ కిష్టయ్య, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అరిపోద్దిన్, సొసైటీ చైర్మెన్ రత్నాకర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ సుధీర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

రైతు పండుగ కార్యక్రమానికి బయల్దేరిన కాంగ్రెస్ శ్రేణులు



నవతెలంగాణ-సదాశివపేట

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నేడు(శనివారం) మహబూబ్‌నగర్‌లో నిర్వహించే రైతు పండుగ కార్యక్రమానికి సదాశివపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చాట్ల సిద్ధన్న ఆధ్వర్యంలో వివిధ గ్రామాల రైతులు, పార్టీ నాయకులు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు చాట్ల సిద్ధన్న మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే రైతు పండుగ కార్యక్రమంలో నిర్వహించే రైతు మేళ, ఎగ్జిబిషన్‌లకు మండలంలోని గ్రామాల నుండి రైతుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు అని తెలిపారు. మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బస్సు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

3 నెలలుగా జీతాల్లేవ్..



- కుటుంబ పోషణకు కూడా నానా అవస్థలు
- వెంటనే అధికారులు స్పందించి.. వేతనాలు ఇవ్వాలి
- తంగడపల్లి జీపీ కార్మికుల వేడుకోలు

నవతెలంగాణ-సదాశివపేట

మండల పరిధిలోని తంగడపల్లి గ్రామపంచాయతీ కార్మికులకు గత మూడు నెలల నుంచి జీతాలు అందట్లేదు. దాంతో తమ కుటుంబ పోషణ కూడా భారంగా మారిందని సదరు జీపీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీలోని సఫాయి కార్మికులు, అదేవిధంగా పంచాయతీ కార్యాలయానికి అనుసంధానంగా ఉండే నర్సరీకి నీళ్ల పట్టే కార్మికుడు, పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌కు సంబంధించి మూడు నెలల నుంచి జీతాలు అందలేదు. నిత్యం గ్రామాల్లో నానా రకాలు పనులు చేస్తూ.. ఉత్తమ గ్రామ పంచాయతీలుగా అవార్డులు పొందుతున్నా తమను మాత్రం ఎవ్వరూ పట్టించుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ అవసరాలు, పిల్లలు ఫీజులు లాంటి అత్యవసరాలకు అప్పులు చేయక తప్పడం లేదని వాపోతున్నారు. మరోపక్క ప్రభుత్వ బిల్లులు రాక పంచాయతీలోని పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. తంగడపల్లి గ్రామంలో వేస్తున్న బ్రిడ్జి మధ్యలోనే నిలిచిపో వడంతో గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి.. బ్రిడ్జిని నిర్మించాలని, అలాగే కార్మికులకు ప్రతీనెలా ఒకటో తారీఖునే వేతనాలు అందజేయాలని ఇటు గ్రామస్తులు, అటు కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తొందరలోనే అందుతాయి

దసరా సమయంలో స్పెషల్ ఆఫీసర్ రవి సస్పెండ్ అయ్యారు. దాంతో కార్మికులకు ఇచ్చే వేతనాలు ఆలస్యం అయ్యాయి. ఇప్పుడు కొత్తగా స్పెషల్ ఆఫీసర్ వస్తున్నారు. తనది రిజిస్ట్రేషన్ అవ్వనందున లేట్ అవుతుంది. కచ్చిత ంగాపంచాయతీ కార్మికుల వేతనాలుతొందరలోనే వస్తాయి.

– గీతాంజలి, తంగడపల్లి పంచాయతీ సెక్రెటరీ

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



గత మూడు నెలల నుంచి జీతాలు రాకపోవడంతో చాలా ఇబ్బం దులు పడుతున్నాం. పంచాయతీ సెక్రెటరీకి ఎన్నిసార్లు విన్నవించినా పట్టిం చుకోవడం లేదు. రెక్కాడితేగానీ డొక్కాడని మాలాంటి పేదలను ఇబ్బందులు పెట్టడం సరికాదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మా జీతాలు ఇప్పించగలరు.

– దుర్గయ్య, పంచాయతీ కార్మికుడు

ట్రాక్టర్‌కు డీజిల్ కూడా కొట్టించలేకపోతున్నాం



తంగడపల్లి పంచాయతీని పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. ట్రాక్టర్‌కు సైతం డీజిల్ కొట్టించలేకపోతున్నాం. గ్రామంలో చెత్త సేకరించాలంటే గతంలో ప్రతీరోజూ తిరిగే వాళ్ళం. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఒకరోజు తప్పించి మరోరోజు చెత్త సేకరిస్తున్నాం. జీతాల గురించి సెక్రెటరీని అడిగితే స్పందించడం లేదు. అధికారులే సమస్యను పరిష్కరించాలి.

– రాచన్న, పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్



విఠలేశ్వర ఆలయాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని అంతరం గ్రామంలో వెలసిన జీవన్ముక్త విఠలేశ్వర ఆలయాన్ని అందోల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ శుక్రవారం సందర్శించారు. ప్రతీయేడు జాతర సమయంలో అంతారంలోని జీవన్ముక్త దేవాలయాన్ని ఆయన ఆనవాయితీగా సందర్శిస్తున్నారు. అందులో భాగంగా ఈ యేడు దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆయనకు ఘనస్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జైపాల్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పైతర మీనాక్షి సాయికుమార్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శశి కుమార్, మాజీ సర్పంచులు ఎడ్ల శంకర్, సిద్ధన్న పాటిల్, సనియర్ నాయకులు శివశంకర్ పటేల్,నగేష్ పాల్గొన్నారు.



ఉచిత పశువైద్య శిబిరం..

నవతెలంగాణ-హత్నూర

మండలంలోని దౌలాపూర్ గ్రామంలో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ హేమలత పాడిపశువులకు గర్భకోశ, సాధారణ చికిత్సలు చేసి.. దూడలకు నట్టల నివారణ మందులు తాగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశువులు రోగాల బారిన పడకుండా రైతులు ముందు జాగ్రత్తగా టీకాలు వేయించాలన్నారు. దూడలకు నటన నివారణ మందులు నెలకు ఒకసారి ఆరు మాసాలు తప్పకుండా తాగించాలన్నారు. గోపాలమిత్ర ద్వారా నాటు పశువులకు మేలురకమైన ఎద సూదుల ద్వారా పాడి సంపద పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సుధాకర్, సిబ్బంది సంగమేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలు, కేజీబీవీల్లో ప్రతీవారం తనిఖీలు చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లాలోని కస్తూర్బా పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, సంక్షేమ గురుకుల పాఠశాలాలు , మాడల్ పాఠశాల్లో మండల ప్రత్యేక అధికారులు, ఆయా సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు, ఆర్‌సీఓలు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. కలెక్టరేట్లో ఆయా శాఖల అధికారులు, గురుకులాల , కేజీబీవీల ప్రత్యేక అధికారులతో జిల్లా కలెక్టర్ శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని మండలాల ప్రత్యేక అధికారులు ఆయా మండలాల పరిధి సంక్షేమ వసతి గృహాలు సంక్షేమ గురుకుల పాఠశాలలను కేజీబీవీపీలను మోడల్ పాఠశాలలను ప్రతీ వారం తనిఖీలు నిర్వహించాలన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేయాలన్నారు . వసతి గృహాలు సంక్షేమ గురుకుల పాఠశాలల ఆవరణలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు తనిఖీ సమయంలో ఆయా సంస్థల్లోని వంట గదులు, స్టోర్ రూమ్‌లను డైనింగ్ హాల్‌లను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. తరగతి గదులు విద్యార్థుల గదులను కిటికీలు డోర్లు అవసరమైన మరమ్మతులకు ప్రతిపాదన సిద్ధం చేయాలన్నారు. అవసరమైన అద్దె భవనం యజమానులతో మాట్లాడి వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. వసతి గృహాలకు అవసరమైన కాంపౌండ్ వాల్ , సోలార్ ఎలక్ట్రిక్ ఫెన్సింగ్ కు సంబంధించిన నివేదికలు అందించాలన్నారు వసతి గృహాలకు విద్యార్థులకు సరిపడా మంచినీటి కనెక్షన్లు ఇప్పించాలని మిషన్ భగీరథ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. తాగునీరు అందించే విషయంలో అలసత్వం వహించద్దు అన్నారు. మిషన్ భగీరథ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ వసతి గృహాలు సంక్షేమ గురుకుల పాఠశాలలో కస్తూర్బా పాఠశాలల్లో తాగునీటి సమస్య తలెతకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతుందా లేదా తెలుసుకోవాలన్నారు. వసతి గృహాల సందర్శన సమయంలో స్టోర్ రూమ్లను పరిశీలించి నాసిరకం వస్తువులను వెంటనే వెనక్కి పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. బియ్యంలో తెల్ల పురుగులు లాంటివి వస్తే వెంటనే స్టాకు వెనక్కు పంపాలన్నారు. ఎక్స్పైరీ డేట్ అయిన వస్తువులను వెంటనే స్టాక్ నుండి తీసివేయించాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం తయారు చేసేలా వంట ఏజెన్సీ సిబ్బంది, విద్యార్థుల సంఖ్యకు సరిపడా నియమించుకోవాలని కలెక్టర్ ఆయా శాఖల అధికారులు ఆదేశించారు. వసతి గృహంలో ఉన్న ప్రతి చిన్న సమస్యలు సైతం గుర్తించి వాటి మరమ్మత్తులకు పూర్తిస్థాయి నివేదికను అందజేయాలన్నారు. ప్రైవేటు అద్దె భవనాల్లో ఉన్న సంస్థల లో అవసరమైన మరమత్తులను ఆయా భవనాల యజమానులతో మాట్లాడి వెంటనే మరమతులు చేపట్టాలన్నారు. ఎక్కడైనా అధికారులు తమ విధులు పట్ల నిర్లక్ష్యంగా వహించినట్టు తెలిస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్ ,మాధురి , జడ్పీసీఈఓ జానకి రెడ్డి , జిల్లాలోని వివిధ మండలాల ప్రత్యేక అధికారులు బీసీ ఎస్సీ ఎస్టీ సంక్షేమ వసతి గృహాల, గురుకులపాఠశాలల ప్రత్యేక అధికారులు, ఆర్సిఓలు పాల్గొన్నారు.

పొగమంచులో ప్రయాణం ప్రమాదకరం

- యాక్సిడెంట్లు జరిగే అవకాశం..
- పరిమితవేగంతో ప్రాణాలకు రక్షణ
- జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్



నవతెలంగాణ-సంగారెడ్డి

పొగ మంచులో ప్రయాణం ప్రమాద కరం అని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. శీతాకా లంలో ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి చేరి, పొగమంచు దట్టంగా కమ్మేస్తుంటు ందని, రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితులు ఏర్పడతా యన్నారు. ఈ సమయంలోనే ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. వాహనాల నుంచి వెలుపడే పొగ కారణంగా మంచు మరింత దట్టంగా కమ్ముకొని ఉదయం 8 గంటలైనా రోడ్డు సరిగ్గా కనిపించకపోవడంతో.. ఈ సమయాల్లో ప్రయాణం ప్రమా దకరంగా మారే అవకాశం ఉంటుందన్నారు. వాహనానికి లైట్లు వేసుకున్నా.. కొంత దూరంలో ఉన్న వాహనాలు కూడా దగ్గరకు వచ్చే వరకు కనిపించవన్నారు. వేగంగా ప్రయాణం చేస్తే యాక్సి డెంట్లు జరగడానికి అవకాశం ఉం టుందన్నారు. వాహన దారులు పరిమిత వేగంతో ప్రయా ణిస్తే ప్రమాదాలు జరగ కుండా నియంత్రించే అవకాశం ఉంటుందన్నారు. అధిక వేగంలో ఉన్న వాహనం సడన్ బ్రేక్ వేయడంతో బోల్తా పడడం, ఇతర వాహనాలను ఢీకొట్టడం జరుగు తుందని, వాహనదారులు తక్కువ స్పీడ్‌లో ఉంటే ఎదురుగా వచ్చే వాహనా న్ని గుర్తించి, ప్రమాదం జరగకుండా జాగ్రత్త పడడానికి అవకా శం ఉంటుందన్నారు. అందుకే చలికాలంలో డ్రైవిం గ్ చేసేప్పుడు వాహనాల హెడ్‌లైట్లు, ఇండికేటర్లు వేసుకోవాడం శ్రేయస్క రమని.. అత్యవసరమైతే తప్పా ప్రయాణాలు చేయకూడ దని, పొగమంచులో ప్రయాణాలకు దూరంగా ఉండాలన్నారు. ముఖ్యంగా రైతులు వరిధాన్యం కుప్పలు రోడ్లపై ఆరబెట్టకూడదన్నారు. రోడ్లపై రైతులు ధాన్యం కుప్పలు ఆరబోయడం ప్రమాదా లకు దారి తీస్తుందని, ధాన్యం కుప్పలు రోడ్లపై ఆరబోయడం వల్ల ఒకే దారిలో ఎదురె దురుగా ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. రాత్రిపూట దారి వెంట అజాగ్రత్తగా ప్రయాణిస్తే ప్రమాదాలు తప్పవని వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలన్నారు. ధాన్యం కుప్పల కారణంగా ప్రమాదాలు జరిగితే సంబంధిత రైతులపై కేసులు నమోదు చేస్తామని సూచించారు. రోడ్డు ప్రమాదాల కారణం గా ప్రాణాలు పోతుంటే ఆ నష్టం పూడ్చలేనిదని రైతులు గుర్తుంచుకోవాలన్నారు. కాబట్టి రైతులు ఆలోచించి ధాన్యం కుప్పలను రహదారులపై పోయ కుండా ధాన్యం ఆరబెట్టేం దుకు కల్లాలను లేదా ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు.

ఘనంగా దీక్షా దివస్



నవతెలంగాణ-కంది

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం దీక్షా దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్చార్జి దేవి ప్రసాద్, సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్ తదితర నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ.. పోరాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పాలనలో గాడితప్పిందన్నారు. 2009నవంబర్ 29న 'తెలంగాణ వచ్చుడో కేసీఆర్ సచ్చుడో' అనే నినాదంతో ఆనాడు దీక్షకు దిగిన రోజును తెలంగాణ చరిత్రలో మరువలేనిదన్నారు. కేసీఆర్ దిక్షా మొదలు పెట్టడంతో తెలంగాణ ఉద్యమం ఉధృతం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రాణాలు పోతున్నా పట్టించుకోవట్లేదు



నవతెలంగాణ-సంగారెడ్డి

విద్యార్థుల ప్రాణాలుపోతున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అధికారులు పట్టించుకోవడం లేదని ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా గత నెలరోజుల నుంచి ఫుడ్‌ఫాయిజన్‌తో విద్యార్థుల ప్రాణాలు పోతున్నా సీఎం గానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటమాడుతున్నదన్నారు విద్యార్థులకు నాణ్య మైన భోజనం పెట్టకుండా దొడ్డు బియ్యంతో, నాసిరకమైన కూరగాయలతో భోజనం పెడుతున్నారన్నారని ఆరోపిం చారు. విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న ఘటనలపై, ఫుడ్ పాయిజన్ మరణాల పట్ల ముఖ్యమంత్రే బాధ్యత వహిం చాలన్నారు. ఈ నేపథ్యంలో నేడు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల బంద్‌ను చేపడుతున్నామని.. విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రాజకుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులు, ప్రభాస్, అనిల్,లక్ష్మణ్,నరేష్, హరి తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు ఉద్యోగ విరమణ సహజమే



నవతెలంగాణ-జహీరాబాద్

ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ సహజమే అని.. విధి నిర్వహణలో వారు చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చిరస్థాయిగా నిలిచిపోతాయని మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ రవిబాబు అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో మార్కెట్ కమిటీ సెక్రటరీ అనిల్ బాబు ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటుచేసిన సన్మాన సభకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. నేడు ప్రభుత్వ ఉద్యోగాలు చేయడం చాలా కష్టతరంతో కూడుకున్న పని అన్నారు. గత మూడేండ్లుగా జహీరాబాద్ మార్కెట్ కమిటీకి కార్యదర్శిగా అనిల్ బాబు ఉత్తమమైన సేవలు అందించారన్నారు. టైపిస్టుగా మొదలై.. ప్రత్యేక శ్రేణి కార్యదర్శిగా విరమణ పొందడం అభినందనీయమన్నారు. ఆర్‌జె డ మల్లేశం మాట్లాడుతూ.. ఉద్యోగులు ఎక్కడైతే సమన్వయంతో విధులు నిర్వహిస్తారో వారందరూ తమ శాఖలో విజయవంతంగా విరమణలు పొందుతారన్నారు. మార్కెటింగ్ శాఖకు చెందినటువంటి వివిధ జిల్లాల యూనియన్ నాయకులు టీఎన్జీవో నాయకులు మాజీ జేడీ మహమ్మద్ ఇఫ్తార్ నువ్వు మాట్లాడుతూ.. ఉద్యోగంలో ఉన్నప్పుడు అందరూ గౌరవిస్తారని.. విరమణ పొందిన అనంతరం ఎంతోమందికి నెలల తరబడి పెన్షన్ రావడం లేదన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి కూడా తీసుకెళ్లినట్టు చెప్పారు. మార్కెట్ కమిటీ చైర్మెన్ సాయి చరణ్ అనిల్ బాబుకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అనిల్ బాబు కుటుంబ సభ్యులు భార్య శారదా దేవి, కూతురు అర్చన, కుమారుడు సాయి, వివిధ మార్కెట్ కమిటీల సెక్రటరీలు శ్రీనివాస్ ,విక్రం గౌడ్, చంద్రశేఖర్, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

ఫుడ్ ఇన్స్పక్టర్‌ను సస్పెండ్ చేయాలని డీవైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి అనిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఉన్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో అధికారి లేకపోవడంతో ఖాళీ కూర్చీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రభుత్వ వసతి గృహాలు గానీ, ప్రయివేటు వసతులు గృహాల్లో గానీ హెూటల్స్, రెస్టారెంట్లో కల్తీ ఆహార పదార్థాలను వండి పెట్టడంతో విద్యార్థులు, ప్రజలు అనారోగ్యాలను బారినపడి ఆస్పత్రికి వెళ్తున్నారని ఆరోపించారు. అధికారులు మాత్రం తనిఖీలు చేయకుండా నిర్లక్ష్యంగా వహించడం సరైన పద్ధతి కాదన్నారు. సంబంధిత జిల్లా అధికారులు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పైన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా నిరంతరం జిల్లాలో తనిఖీలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు సాయి, శివ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు బీజేపీ శ్రేణుల తరలింపు



నవతెలంగాణ-జిన్నారం

గురుకులాల్లో విద్యార్థులకు జరుగుతున్న ఇబ్బందులపై మాసబ్ ట్యాంక్ దగ్గర బీజేపీ మహాధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా బీజేపీ మండల శ్రేణులు పోలీసులు స్టేషన్‌కు తరలించారు. స్టేషన్‌కు వెళ్లినవారిలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు వంగేటి ప్రతాపరెడ్డి, జిన్నారం మండల బిజెపి అధ్యక్షులు కొత్త కాపు జగన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

3 నెలల జీతాలు రాకుంటే జీపీ కార్మికులు బతికేదేట్ల?



- సీఐటీయూ ఉపాధ్యక్షురాలు బాలమణి

నవతెలంగాణ-నిజాంపేట

మూడు నెలల నుంచి గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికులకు జీతాలు ఇవ్వడం లేదని సీఐటీయూ మెదక్ జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవోకు, ఎంపీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచే పారిశుద్ధ కార్మికులకు మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వకుంటే వారు బతికేది ఎట్లా అని అన్నారు. ప్రభుత్వం ఇచ్చే జీతాలు సరిపోవడం లేదని ప్రతి జీపీ కార్మికుడికి రూ.16 వేల వేతనం చెల్లించాలని ఎన్నిసార్లు ప్రభుత్వాలకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రతినెల కార్మికులకు సబ్బులు, గ్లౌజులు, అందజేయాలని కోరారు. ఎంపీడీవో స్పందిస్తూ వారం రోజులలో ఐడీ కార్డులు అందజేస్తామని. జీపీ కార్మికుల సమస్యల గురించి పై అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భత్తుల రాములు, మల్లేశం, రవి, నర్సింలు, సుగుణ, రాజవ్వ, శాంతమ్మ మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

మెదక్ దీక్షా దివస్‌కు బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-తూప్రాన్

మెదక్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు చేపట్టిన దీక్ష దివస్ కార్యక్రమానికి మండలంలోని బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. మాజీ జెడ్పీటీసీ సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు పట్టణంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద నుంచి బయలుదేరారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి 15 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యాదిలోనే దీక్షా దివస్ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు సతీష్ చారి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పల్లె ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచులు రాజిరెడ్డి,రమేష్, మైనార్టీ నాయకులు సత్తార్, బురాన్, అహ్మద్, గంగాధర్ వెంకటేష్, ఉద్యమ నాయకులు మన్నె శ్రీనివాస్, వెంకట్ చారి యువజన నాయకులు యాసిన్,బాయికాడి ఆంజనేయులు,సామల అశోక్, బాలేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.


రామాయంపేట రాత మార్చేదెవరు..?



- పాలకుల నిర్లక్ష్యంతో కలతప్పిన పట్టణం
- అధ్వానంగా పట్టణంలోని ప్రధాన రహదారులు
- పూర్తిగా దెబ్బతిన్న అంతర్గత రోడ్లు, మురికి కాలువలు
- మౌలిక వసతులు లేక అవస్థలు..

నవతెలంగాణ-రామాయంపేట

"రామాయంపేట" ఒకప్పుడు నియోజకవర్గ కేంద్రంగా వెలుగొందిన ఈ పట్టణం. ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చేసిన టంగుటూరి అంజయ్య ప్రాతినిధ్యం వహించి, రాష్ట్రంలోని పేరు గాంచిన పట్టణం. కానీ నేడు అభివృద్ధిలో వెనుకబడిపోయి అధ్వానంగా మారిన పరిస్థితి. 2010 సంవత్సరంలో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా, ఈ పట్టణం తన ప్రత్యేకతను కోల్పోయి, ఆ తర్వాత మున్సిపాలిటీ హోదాను పొందినా, పట్టణ ప్రజల అభివృద్ధి కలలు కలలుగానే మిగిలిపోయాయి. ఒకప్పుడు గజ్వేల్, తూప్రాన్ పట్టణాల కన్నా అభివృద్ధిలో ముందున్న రామాయంపేట, ఆ పట్టణాలు అభివృద్ధిలో దూసుకుపో తుంటే.. పాలకుల నిర్లక్ష్యం కారణంగా, రామాయంపేట దినదినం కల తప్పుతూ వస్తుంది. రామాయంపేట రాత మార్చేదెవరని పట్టణ ప్రజలు ఎదురుచూసే పరిస్థితి నెలకొంది.



ఒకప్పటి రామాయంపేట వైభవం

అనేక సంవత్సరాల క్రితం రామాయంపేట అభివృద్ధిలో ముందుండేది. నియోజకవర్గ కేంద్రంగానే కాకుండా, తాలూకా కేంద్రంగా కూడా ఉండేది. మూడు నాలుగు మండలాల నుంచి ప్రజలు నిత్యం రామాయంపేట పట్టణానికి రాకపోకలు సాగిస్తుండేవారు. నేషనల్ హైవే రోడ్లకు కేంద్రంగా, చుట్టుపక్కల గ్రామాల వారందరికీ కేరాఫ్ అడ్రస్‌గా ఉండేది. కానీ నియోజకవర్గ కేంద్రం గల్లంతయ్యాక, పట్టణం ప్రాధాన్యతను కోల్పోయింది. దానికి తోడు పాలకుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధిలో వెనుకబడిపోయింది.



నేడు రామాయంపేట పరిస్థితి..

పట్టణంలోని ప్రధానమైన గాంధీ రోడ్డు వంటి రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. రోడ్డంతా గుంతల మయమై, రోడ్డుపై ప్రయాణం చేసేవారు నరకయాతన అనుభవిస్తున్నారు. 15-20 ఏళ్ల క్రితం వేసిన రహదారులు ఇప్పటికీ మరమ్మతుల కోసం ఎదురుచూస్తున్నాయి. పట్టణ లోని అంతర్గత రోడ్ల పరిస్థితి అయితే మరి దారుణంగా ఉంది. హైదరాబాద్ నిజామాబాద్ పాత హైవే రోడ్డు ను పట్టించుకున్న నాధుడే కరువయ్యాడు. మెదక్ రోడ్డు సిద్దిపేట రోడ్డులో నూతనంగా వేసిన, అవి ఇరుకుగా మారి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారులపై ఆకర్షణీయమైన లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. పట్టణంలోని సిద్దిపేట క్రాస్ రోడ్, మెదక్ క్రాస్ రోడ్ వంటి ప్రధాన కూడల్లను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ప్రతివారం సంతకు వచ్చే మహిళలకు మూత్రశాల లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు పడితే అక్కల బస్తీ వంటి ప్రాంతాలలో మురికి కాలువలు పొంగి ఇళ్లలోకి నీరు చేరుతుంది. కూరగాయల మార్కెట్ పాత గోడలలో, ప్లాస్టిక్ కవర్ల కింద కొనసాగుతుంది. మరెన్నో సమస్యలతో రామాయంపేట కలతప్పిపోయింది. అభివృద్ధికి నిధుల ప్రశ్న మున్సిపాలిటీగా మారిన తర్వాత అభివృద్ధి కోసం నిధులు మంజూరవుతాయని ప్రజలు భావించినా, అలాంటి పరిస్థితి కనిపించలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో టియూఎఫ్ఐడిసి ద్వారా నిధులు మంజూరైనట్లు ప్రకటించారు. ఆ తర్వాత కొద్ది రోజులకే ప్రభుత్వం మారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. నాడు మంజూరైన ఆ నిధులు ఎలా వినియోగించారు, అసలు వినియోగించారా... లేదా, అనే ప్రశ్నలకు సమాధానం లేదు. ఏడాది క్రితం ఎన్నికైన నూతన ఎమ్మెల్యే అయిన ప్రత్యేక నిధులు తెచ్చి రామాయంపేటను అభివృద్ధి పరిచేనా.. అని స్థానికులు ఎదురుచూస్తున్నారు.

పాలకులు సమయం ఇస్తేనే అభివృద్ధి..

పట్టణం అభివృద్ధి చెందాలన్నది రామాయంపేట ప్రజల ప్రధాన ఆకాంక్ష. రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావాలి. పాలకులు ప్రభుత్వాధికారులు, పట్టణ అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి చూపించాలి. రామాయంపేట తిరిగి అభివృద్ధి బాట పట్టాలంటే, నిధుల వినియోగంపై సమగ్ర పరిశీలన జరపడంతో పాటు, పాలకులు ప్రధానంగా దృష్టి సారించి, పట్టణానికి తమ సమయాన్ని కేటాయించాలి. అప్పుడే పట్టణ ప్రజల ఆకాంక్షలు నెరవేరి, రామాయంపేట గత వైభవాన్ని తిరిగి పొందుతుంది.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా



నవతెలంగాణ-మెదక్

విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఎబీవీపీ నాయకుడు కిరణ్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ధర్నా నిర్వహించారు. విద్యార్థుల సమస్యలను పరిశీలించాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ఎబీవీపీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కార్యదర్శి ఉదయ్ కిరణ్, హరి, నాగరాజు, అర్జున్, భరత్, పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలి



- డయల్ 100 కాల్స్ పై తక్షణమే స్పందించాలి
- జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-చిలిపిచేడ్

ప్రజలకు మరింత చేరువయ్యేలా పోలీస్ విధులు ఉండాలని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా శుక్రవారం చిలిపిచేడ్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతలు కాపాడటంలో బ్లూ కోట్స్ సిబ్బంది ముందుండి డయల్ 100 కాల్స్ పై తక్షణమే స్పందించాలన్నారు. సిసి కెమెరాల ప్రాముఖ్య తను తెలియజేస్తూ అన్ని గ్రామాల పట్టణ ప్రజలు, ప్రజా ప్రతినిధులు ముందుకు వచ్చి తమ గ్రామాలలో విధిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పెండింగ్ లో ఉన్న కేసుల గురించి సమీక్షించారు. చేయాలన్నారు. నర్సాపూర్ సిఐ జాన్ రెడ్డి, ఎస్సై నర్సింలు, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు

కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



- మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి

నవతెలంగాణ-టేక్మాల్

ఆడబిడ్డలు కష్టాల్లో ఉంటే చూడలేమని అందుకే వారి కన్నీళ్లు తుడవడం కోసం కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్నామని జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం టేక్మాల్ రైతు వేదిక వద్ద 73 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు నేరుగా అందిస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిమ్మ రమేష్, జడ్పీ కో ఆప్షన్ సభ్యులు యూసుఫ్ అలీ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు భక్తుల కిషోర్, మండల కో ఆప్షన్ షేక్ మాజర్, శ్రీధర్ ఆచారి, అవినాష్, ఆనందం, కొండ రవి, పులి రవి, తదితరులు ఉన్నారు.

కుళ్లిన కూరగాయలు వండితే చర్యలు తప్పవు



నవతెలంగాణ-టేక్మాల్

కుళ్ళిపోయి పాడైన పురుగులు పట్టిన కూరగాయలు వండితే చర్యలు తీసుకుంటామని అల్లాదుర్గం సీఐ రేణుక అన్నారు. శుక్రవారం టేక్మాల్ కస్తూరి బా పాఠశాల ను ఆమె ఆకస్మి గంగ సందర్శించి, తనిఖీలు నిర్వహించారు. పాఠశాలల శుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, మెనూ ప్రకారం ఆహారాన్ని అల్పాహారాన్ని అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కూరగాయల స్టోరేజ్‌ను పరిశీలించి పాడైన ఆహార పదార్థాలను ఎందుకు వండుతున్నారని ప్రత్యేక అధికారి బాలమనిని ఆమె ప్రశ్నించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే నిర్భయంగా తమ దృష్టికి తీసుకురావచ్చని విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ఈమె వెంట టేక్మాల్ ఎస్సై రాజేష్ సిబ్బంది ఉన్నారు

టీఎస్ యుటిఎఫ్ శివంపేట మండలం నూతన కమిటీ ఎన్నిక



- అధ్యక్షులుగా డాక్టర్ చక్రు సింగ్, ప్రధాన కార్యదర్శిగా కనకరాజు

నవతెలంగాణ-నర్సాపూర్

శివంపేట మండలం టీఎస్ యుటిఎఫ్ నూతన కమిటీని టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నుకోన్నారు. అధ్యక్షులుగా చక్రు సింగ్, ప్రధాన కార్యదర్శిగా కనకరాజు, కార్యదర్శులుగా సూర్య, ప్రదీప్ రెడ్డి, షాబుద్దీన్, భాస్కర్, సుబ్బారెడ్డి, లక్ష్మణరావు, శ్రీనివాస్, నవీన్, ఆంజనేయులు, అభిలాష్‌లను ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ సభ్యులుగా శ్రీనివాస్, పాషా, చంద్రశేఖర్, హేమ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్



- సైన్స్ ఫెయిర్‌ను సందర్శించిన మున్సిపల్ చైర్మన్

నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణంలోని అక్షర ప్లానెట్ పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ అందరిని ఆకట్టుకుంది . శుక్రవారం విద్యార్థులు వివిధ రకాల సైన్స్ పరికరాలను తయారు చేసి ప్రదర్శించారు. ఈ సైన్స్ ఫెయిర్‌ను మున్సిపాల్ చైర్మెన్ అశోక్ గౌడ్, పాఠశాల డైరెక్టర్ అశోకులు సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాసి, ఉపాధ్యాయులు సుమిత్ర, లత, సావిత్రి, మౌనిక, విద్యార్థులు పాల్గొన్నారు.

హాస్టళ్లను తనిఖీ చేసిన అధికారులు



నవతెలంగాణ-చేగుంట

చేగుంట మండలంలోని ఎస్సీ, బీసీ, గర్ల్స్ ,బాయ్స్ హాస్టల్‌ను శుక్రవారం మండల ప్రత్యేక అధికారి స్వరూ ప, ఎంపీడీవో చెన్నారెడ్డి, ఎంఈఓ నీరజలు తనిఖీ నిర్వహించారు. మధ్యాహ్నం భోజనం వంటగది, పరిసరాలు పరిశుభ్రతపై సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చదువుకున్న విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, సమయానికి భోజనం మెనూ ప్రకారం అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ విజయ్, హాస్టల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతు పండుగకు రైతులు తరలి రావాలి



- వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోవిందు

నవతెలంగాణ-మెదక్

మహబూబ్‌నగర్‌లో జిల్లాలో డిసెంబర్ 30వ తేదిన నిర్వహించే రైతు పండుగకు రైతులంతా తరలిరావాలని జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏడాది పాలనలో ప్రభుత్వం రైతు పండగ నిర్వహిస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యే ఈ కార్యక్రమానికి రైతులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. 15 బస్సుల ద్వారా 750 మంది రైతులను తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు. కొల్చారం, కౌడిపల్లి, శివంపేట, తూప్రాన్, శంకరంపేట, రామాయంపేట, అల్లాదుర్గం రైతు వేదికలో లైవ్ స్ట్రీమింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



- ఎంఈఓ కార్యాలయంలో వినతి

నవతెలంగాణ-నర్సాపూర్

మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మహేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం శివంపేట మండలం కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు రావలసిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పదివేల వేతనం ఇవ్వాలని అన్నారు. గుడ్డకు అదనపు బడ్జెట్ కేటాయించాలని లేదా అంగన్వాడి సెంటర్లకు సరఫరా చేసే విధంగా మధ్యన భోజన కార్మికులకు సరఫరా చేయాలని, మధ్యన భోజన కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు దుర్గమ్మ ,లక్ష్మి ,రంగమ్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అడవులను రక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిది



- రామయంపేట ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ గీత

నవతెలంగాణ-చేగుంట

అడవులను రక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రామయంపేట ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ గీత పేర్కొన్నారు.రామాయంపేటఫారెస్ట్ రేంజ్ పరిధిలోని రుక్మాపూర్ గ్రామంలో శుక్రవారం ప్రభుత్వ పాఠశాలలో రామాయంపేట డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ గీత ఆధ్వర్యంలో విద్యార్థులకు అడవుల రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ చలికాలంలో అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అడవులను రక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇందుకోసం ప్రజలు సహకరించాలనీ, అడవులను రక్షించుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, మన అడవులను కాపాడుకుందాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ మధుబాల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కాసింపూర్ తండా పంచాయతీ ఏర్పాటుకు కృషి చేశా



- మరింత అభివృద్ధికి తోడ్పడతా
- ధరావత్ రామచందర్

నవతెలంగాణ-నిజాంపేట

రజాక్ పల్లి గ్రామపంచాయతీ నుంచి కాసింపూర్ తండాను నూతన గ్రామపంచాయతీ ఏర్పాటుకు ఎంతో కృషి చేశానని ధరావత్ రామచందర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత రజాక్ పల్లి గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ధరావత్ లక్ష్మీబాయి సర్పంచ్‌గా ఉన్నప్పుడు అనేక అభివృద్ధి పనులు చేశారని తెలిపారు. సర్పంచ్ కుమారుడిగా తాను గ్రామాభివృద్ధికి కృషి చేశానని రామచందర్ తెలిపారు. మండల కేంద్రం నుంచి కల్వకుంట 5 కిలోమీటర్ల వరకు దాదాపు రూ.3 కోట్లతో బీటీ రోడ్డు వేయించారని, కాసింపూర్ తాండ ఎక్స్ రోడ్డు నుంచి తాండ వరకు రూ.కోటీ 20 లక్షలతో బీటీ రోడ్డు వేయించామన్నారు. సీసీ రోడ్లకు రూ.90 లక్షలు, డ్రైనేజీలకు రూ.25 లక్షలు, మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌ను నిర్మించానన్నారు. రజక్ పల్లి , కాసింపూర్‌లలో చెరువు మత్తడులను కట్టించానన్నారు. కాసింపూర్ గ్రామంలో మినీ వాటర్ ట్యాంకులను కట్టించారు. కాసింపూర్ తాండవాసులు నన్ను సర్పంచిగా గెలిపించినట్లయితే తండావాసులకు అందుబాటులో ఉండి వారి కష్ట, సుఖాలలో పాల్పంచుకుంటానన్నారు.



కాసింపూర్ తండా నుంచి జద్చర్ తండాకు బీటీ రోడ్డు వేయిస్తానని, కాసింపూర్ తండా నుంచి బచ్చు రాజు పల్లి గ్రామానికి బీటీ రోడ్డు వేయిస్తానని, నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మిస్తానని, ఎస్టి కమ్యూనిటీ హాల్ కట్టిస్తానన్నారు. ప్రతి వాడకు కరెంటు పోల్స్ వేయించి ప్రతి స్తంబానికి లైట్లు వేసి తండావాసులవుకు చీకటి తొలగించి వెలుగు చూపిస్తానన్నారు. తండావాసులు తనను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటారని ప్రగాఢ విశ్వాసంతో ఉన్నానన్నారు.

నేటి ప్రభుత్వ పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయండి



- విద్యార్థుల ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్

నవతెలంగాణ-మెదక్ టౌన్

రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పిడిఎస్ యూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో డిసెంబర్ 30వ తేదిన నిర్వహించే ప్రభుత్వ పాఠశాలల బందును విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ మెదక్ జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్ అన్నారు. విద్యార్థుల ప్రాణాలు పోతున్న సీఎం రేవంత్ రెడ్డి, అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో వామపక్ష విద్యార్థి సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మెదక్ జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి దినకర్ మాట్లాడుతూ గత నెల రోజుల నుంచి ఫుడ్ పాయిజన్ తో విద్యార్థుల ప్రాణాలు పోతున్నా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడంలేదన్నారు రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకుండా దొడ్డు బియ్యంతో నాసిరకమైన కూరగాయలతో భోజనం పెడుతున్నారన్నారు. గురుకుల, సంక్షేమ హాస్టల్లు, జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత లేని కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థకు గురవుతున్నారన్నారు. వరుస ఘటనలకు సీఎం బాధ్యత వహించాలన్నారు. విద్యార్థుల మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ సభ్యులు అజయ్ కార్తీక తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తూప్రాన్

రాష్ట్రంలో ఫుడ్ పాయిజన్ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి మానుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ పాఠశాలలను స్వచ్ఛందంగా బందుకు పిలుపునిచ్చాయి. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసి సంవత్సర కాలం పూర్తి అవుతున్నా రాష్ట్రంలో ఇప్పటి వరకు విద్యాశాఖకు మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటన్నారు. అలాగే రాష్ట్రంలో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించకపోవడం బాధాకరమన్నారు. అలాగే రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూలు హాస్టల్‌లో గురుకులాల్లో అనేక సమస్యలు నెలకొన్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యత లేకపోవడం వల్లనే రాష్ట్రంలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అవుతుందని పేర్కొన్నారు. ఫుడ్ పాయిజన్ వల్ల చాలామంది విద్యార్థులు అవస్థలు పడుతూ ప్రాణాల మీదికి వస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం చాలా దురదృష్టకరమని విమర్శించారు. ఈ వరుస ఘటనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలన్నారు. ఫుడ్ పాయిజన్ వల్ల రాష్ట్రంలో చనిపోయిన విద్యార్థులకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్ డిమాండ్ చేశారు.



విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకే సైన్స్‌ఫేర్



- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-మెదక్ టౌన్

విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మెదక్ పట్టణంలో వెస్లీ పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఇన్స్‌పైర్ వైజ్ఞానిక ప్రదర్శన-2024 అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, సంబంధిత ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఇన్స్‌పైర్ వైజ్ఞానిక ప్రదర్శనను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా చదువుకొని శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. విద్యార్థులు సైన్స్, గణితాన్ని ఇష్టపడి చదివి గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. సమస్యకు పరిష్కారం చూపడానికి, నూతన ఆవిష్కరణలకు సైన్స్, గణితము దోహదపడుతాయన్నారు. ఇన్స్‌పైర్ వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు చూపించిన అంశాలను వాటిని ప్రయోగాత్మకంగా అమలు చేసినప్పుడే ఫలితాలు ఉంటాయన్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు సెల్ఫ్ కాన్ఫిడెన్స్ తో పాటు విజ్ఞానాన్ని పెంపొందించాలని చెప్పారు. ఆహారం ఆరోగ్యం పరిశుభ్రత-53, సహజ వ్యవసాయం-42, రవాణా కమ్యూనికేషన్-70, విపత్తుల నిర్వహణ-43, వ్యర్థాల నిర్వహణ-45, గణిత నమూనా-48, ఇన్స్ పైర్ -36, 337 అంశాలలో విద్యార్థినీ, విద్యార్థులు అద్భుత ప్రతిభను కనబరిచారు. అంతకముందు కలెక్టర్ వైజ్ఞానిక ప్రదర్శనలో పిల్లలు ప్రదర్శించిన అంశాలను పరిశీలించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుమల సుహాసిని రెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్ మూర్తి,

ఉద్యోగ జీవితంలో మంచి పేరు సంపాదించాలి



- జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

నవతెలంగాణ-మెదక్

ప్రతి ఒక్కరు ఉద్యోగ జీవితంలో మంచి పేరు సంపాదించాలని కలెక్టర్ రాహుల్ రాజు తెలిపారు. పట్టణం లోని మాయ గార్డెన్‌లో బీసీ సంక్షేమ అధికారి నాగరాజ్ గౌడ్ పదవీ విరమణ ఆత్మీయ సన్మాన సభను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, అంకితభావానికి మారుపేరు బీసీ సంక్షేమ శాఖ అధికారి నాగరాజ్ గౌడ్ అని కలెక్టర్ కొనియాడారు. అంతకుముందు కలెక్టర్ శాలువాలు మెమొంటోలు పూల బొకేలతో బీసీ సంక్షేమ అధికారి నాగరాజు గౌడ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి, జాముల నాయక్, మత్స్య శాఖ అధికారి, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు నరేందర్, కార్యదర్శి రాజ్ కుమార్, సంబంధిత బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దీక్షా దివస్

- తెలంగాణ తల్లి చిత్రపటానికి, అమరవీరుల స్థూపానికి నివాళులు
- కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



నవతెలంగాణ-మెదక్ టౌన్

శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ వద్ద అంబేద్కర్ చౌరస్తాలో జిల్లా పార్టీ అధ్యక్షులు యం. పద్మ దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు శుక్రవారం 'దీక్షా దివాస్'ను నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణ తల్లి, చిత్రపటానికి అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. దీక్ష దివాస్ వద్ద ఉద్యమం సమయంలో చేసిన పోరాటాల చిత్రపటాల గ్యాలరీని ప్రారంభించి ఫోటోలను వీక్షించారు. ఈ సందర్భంగా పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని ఉద్యమ నాయకుడు కేసీఆర్ ప్రాణాలకు తెగించి పోరాడారన్నారు. కేసీఆర్ దీక్షతో తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందన్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ చావు నోట్లో తలపెట్టి తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగానికి తెగించిన సందర్భాన్ని తెలంగాణ గడ్డ ఎన్నటికీ మర్చిపోలేదన్నారు. ఈ దీక్ష యావత్ భారతదేశ రాజకీయ వ్యవస్థను కదిలించిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ లు బట్టి జగపతి మల్లికార్జున గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి,నాయకులు కంఠ రెడ్డి తిరుపతి రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ చంద్ర గౌడ్, పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ల. ఆంజనేయులు, కో కన్వీనర్లు. కృష్ణ గౌడ్ లింగారెడ్డి, జుబేర్ అహ్మద్ ,మెదక్ మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీనివాస్, భీమరి కిషోర్, జయరాజు, మాజీ కౌన్సిలర్ చంద్రకళ, మెదక్ నర్సాపూర్ నియోజకవర్గంలోని మండల పార్టీ అధ్యక్షులు, పిఎసిఎస్ చైర్మన్ లు మాజీ జెడ్పీటీసీలు ఎంపీపీలు, సర్పంచులు ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



దీక్ష దివాస్‌కు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

నవతెలంగాణ-నర్సాపూర్

మెదక్‌లో నిర్వహించనున్న దీక్ష దివాస్ కార్యక్రమానికి నర్సాపూర్ నుంచి ఎమ్మెల్యే సునీత రెడ్డి నేతృత్వంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. నర్సాపూర్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, వైస్ చైర్మన్ నహీముద్దీన్, మాజీ జెడ్పిటిసిలు, బాబ్యా నాయక్, పబ్బ మహేష్ గుప్తా, బీఆర్ఎస్ నాయకులు, చంద్ర గౌడ్, కల్లూరి హరికృష్ణ మండల పార్టీ అధ్యక్షులు భోగా శేఖర్, నాయకులు, పంబాల బిక్షపతి, మాజీ సర్పంచులు, కర్ణాకర్ సామ్య నాయక్, శ్రీశైలం శివకుమార్ సేనాధిపతి జితేందర్ రెడ్డి, ఊమ్లా నాయక్, నియోజకవర్గస్థాయి ప్రజాప్రతినిధులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు.

నిరుపేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మండలంలోని స్నేహ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పోతరాజుపల్లి శివాజీ నగర్‌లో నిరుపేద కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకులు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్నేహ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దాసరి శ్యామ్ రావు, పాస్టర్ కే ఎన్ సామ్యూల్ రాజ్,గడ్డం బాబుపాల్, ఎన్ కే.రాజేష్, తుడుం యేసుమని, అనిల్, ట్రస్టు టీం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రైతు పండుగకు రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలి



- వ్యవసాయ అధికారి నాగేందర్ రెడ్డి

నవతెలంగాణ-మర్కుక్

నేడు మహబూబ్ నగర్‌లో నిర్వహించే రైతు పండుగ కార్యక్రమానికి మండలం నుంచి రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని మండల వ్యవసాయ అధికారి నాగేందర్ రెడ్డి కోరారు. శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న రైతు పండుగ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యే కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో రావాలని, అక్కడ వ్యవసాయానికి సంబంధించి నూతన పరికరాల, కొత్త వంగడాలు గురించి స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోగలరని కోరారు. రైతులు వెళ్లడానికి బస్సు మర్కుక్ రైతు వేదిక వద్ద ఉదయం 9.గంటలకు ప్రారంభమవుతుంది. 11 గంటలకు వంటిమామిడి ఫంక్షన్ హాల్ వద్ద భోజన కార్యక్రమాలు చేసుకొని బయలుదేరుతామన్నారు. తిరిగి రాత్రి అదే స్థలంలో భోజనం చేసి తర్వాత కార్యక్రమం ముగుస్తుందన్నారు. రావాలనుకున్న రైతులు వ్యవసాయ విస్తరణ అధికారి విష్ణువర్ధన్ (9652207273)ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

నేడు విద్యాసంస్థల బంద్



- ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి అభిషేక్ భాను

నవతెలంగాణ-సిద్దిపేట

ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థుల మరణాలకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం విద్యాసంస్థల బందుకు పిలుపునిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ సిద్దిపేట పట్టణ కార్యదర్శి బత్తుల అభిషేక్ భాను తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ పాయిజన్ ఘటన వల్ల ఎంతోమంది విద్యార్థులు అనారోగ్య పాలయ్యారని, పదుల సంఖ్యలో విద్యార్థులు మరణించారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఫుట్ పాయిజన్లని నిరసిస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వ విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చిందని, పట్టణంలో విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు అజయ్, నవదీప్, ప్రవీణ, రామ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డు పున్నరుద్ధరణ చేయాలి



నవతెలంగాణ-సిద్దిపేట

పొన్నాల నుంచి కరీంనగర్‌కు వెళ్ళే రహదారి పైన ఉన్న ఫ్లైఓవర్ దాబాల వద్ద కరీంనగర్‌కు వెళ్ళే ప్రజలకు ఇబ్బందిగా ఉందని, సర్వీసు రోడ్డు పున్నరుద్ధరణ చేయాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందించినట్లు టీపీసీసీ మైనార్టీ డిపార్ట్మెంట్ మాజీ వైస్ చైర్మెన్ వహీద్ ఖాన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గతంలో సర్వీస్ రోడ్డును పునరుద్ధరించాలని అధికారులకు ఎన్నోసార్లు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. సమస్య ఇప్పటివరకు పరిష్కారం కాలేదని, సర్వీసు రోడ్డు 150 గజాల స్థలం హైవే రోడ్డుకు కలిపితే ప్రజలందరికి సౌకర్యంగా ఉంటుందని అన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- పాఠశాలలను తనిఖీ చేసిన విద్యా కమిషన్ సభ్యురాలు



నవతెలంగాణ-కొండపాక

పాఠశాలల్లో వసతి గృహాల్లో విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని విద్యా కమిషన్ సభ్యులు జోత్స్నారెడ్డి సూచించారు. కమిషన్ సభ్యులు శుక్రవారం మండలంలోని కొండపాక మోడల్ స్కూల్, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని, పరిసరాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనానికి ఉపయోగించే సరుకులను, బియ్యాన్ని పరిశీలించారు. శుచి, శుభ్రత పాటించి మధ్యాహ్న భోజనం నిర్వహించాలని తెలిపారు.విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యాసంస్థల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. విద్య కమిషన్ కమిటీ సభ్యులు జీనత్, డీఈఓ ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

బీజేవైఎం నాయకులు అక్రమంగా అరెస్టు



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండలంలో శుక్రవారం తెల్లవారుజామున సిద్దిపేట జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షులు గుర్రం శ్రీధర్‌తో సహా మండల నాయకుల ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కి తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చినా హామీలు నెరవేర్చకుండా ప్రశ్నిస్తున్న గొంతులను నొక్కుతున్నాయి అని ఎద్దేవా చేసారు. తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సర్కార్ పూర్తిగా విఫలం అయింది అని అన్నారు. అరెస్టు అయిన నాయకులు బీజేవైఎం మండల అధ్యక్షులు నర్రా రాజ్ కుమార్ బీజేవైఎం మండల ఉపాధ్యక్షులు కుంటి బక్కుల శ్రీకాంత్ గౌడ్, లింగాల, కిషన్ ఉన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంపీడీవో



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని నర్సాయపల్లి, గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మద్దూరు ఎంపీడీవో రామ్మోహన్, శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అదేవిధంగా నర్సరీని పరిశీలించి నర్సరీలో కరివేపాకు, మునగ, మొక్కలను ఎక్కువ పెంచాలని పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌కు సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ భాస్కర్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్, పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు కుకునూరుపల్లి విద్యార్థుల ఎంపిక



నవతెలంగాణ-కొండపాక

ఉమ్మడి మెదక్ జిల్లాలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్ 14 టేబుల్ టెన్నిస్ వ్యక్తిగత అంశం బాల, బాలికల ఎంపిక ల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కుకునూరుపల్లి నుంచి బాలుర విభాగంలో గైని భరద్వాజ్ ప్రథమ స్థానం పొంది బంగారు పతకం సాధించాడు. మూడో స్థానంలో రెడ్డమైన హర్షిత్ మోహిత్ విజయ్, ఐదో స్థానంలో ఎండీ జీషాన్, బాలికల విభాగంలో నంగి భానుప్రియ ఐదో స్థానంలో నిలిచి చక్కటి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బచ్చలి సత్తయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు క్యాతం రాజ్ కుమార్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ రెండో వారంలో మెదక్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు

రైతు పండుగను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-మద్దూరు

రాష్ట్ర ప్రభుత్వం నేడు మహబూబ్ నగర్‌లో నిర్వహించే రైతు పండుగ కార్యక్రమం సందర్భంగా రైతు వేదికలో నిర్వహించే విడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేందుకు రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని. మద్దూరు, దూల్మిట్ట, ఏవోలు రామకృష్ణ, అఫ్రోజ్‌లు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు పండుగ సందర్భంగా రైతులు రైతు వేదికలకు చేరుకొని సీఎం రేవంత్ రెడ్డి, చేసే ప్రసంగాన్ని తిలకించాలని కోరారు.

కమిషనర్ పై చర్యలు తీసుకోవాలని ఆర్డీవోకు ఫిర్యాదు



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

హుస్నాబాద్ పట్టణంలో జరుగుతున్న ప్రభుత్వ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సందర్భాల్లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేరు ప్రోటోకాల్ పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం హుస్నాబాద్ ఆర్డీవోకు సమీకృత కార్యాలయంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల శంకర్ బాబు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో నారోజు నరేష్, పోలోజు రాజేందర్ చారీ, న్యాలం సందీప్, బీసా శ్రీకాంత్ పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) బహిరంగ సభ జయప్రదం చేయండి

- సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి
- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల్ నర్సయ్య
- సీపీఐ(ఎం) సిద్దిపేటఅర్బన్ మండల కార్యదర్శి చొప్పరి రవి కుమార్







నవతెలంగాణ-కొండపాక/ సిద్దిపేటఅర్బన్/గజ్వేల్

డిసెంబర్ 1న గజ్వేల్‌లో జరిగే సీపీఐ(ఎం) జిల్లా మహాసభల బహిరంగ సభను జయప్రదం చేయాల ని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల్ నర్సయ్య ,ఆ పార్టీ సిద్దిపేటఅర్బన్ మండల కార్యదర్శి చొప్పరి రవి కుమార్‌లు పిలుపునిచ్చారు. శుక్రవారం గజ్వేల్‌లో విలేకరులతో సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి మాట్లాడారు. మర్పడ్గ, సిరసనగండ్ల, కొండపాక, గ్రామాల హమాలీ కార్మికుల సమావేశాలు బాల్ నర్సయ్య నిర్వహిం చారు. సిద్దిపేటఅర్బన్ మండలం భరత్ నగర్ శాఖ సమావేశాలు నిర్వహించి కరపత్రలను చొప్పరి రవి కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు వేర్వేరుగా మాట్లాడుతూ డిసెంబర్ 1, 2తేదీల్లో సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా మూడో మహాసభలు గజ్వేల్ పట్టణంలో జరుగుతున్నాయని, ఒకటో తేదీన భారీ బహిరంగ సభ నిర్వహిస్తారని దానికి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మహాస భలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల మీద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి రానున్న కాలంలో పోరా టాలను ఉధృతం చేసేందుకు ఈ మహాసభ వేదిక కానున్నదన్నారు. అనేక హామీలు ఇచ్చిన ప్రభుత్వాలు హామీలు అమలు చేయకుండా పక్కదారి పట్టిస్తు న్నారని, హామీల అమలు కోసం ప్రతి ఒక్కరు పోరా టాలకు రావాలని రానున్న కాలంలో ప్రజా సమ స్యలపై అనేక పోరాటాలు నిర్వహిస్తామన్నారు. 1న బహిరంగ సభ, రెండో తేదీన ప్రతినిధుల సభ జరుగుతుందని తెలిపారు. ఈ బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు, హాజరవుతున్నారని తెలిపారు. 1న జరిగే బహిరంగ సభకు ఉమ్మడి మండలం నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. గజ్వేల్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్, సందబోయిన ఎల్లయ్య, మండల కార్యదర్శి సందిటి రంగారెడ్డి, నాయకులు ప్రవీణ్, ఐలయ్య , కొండపాక మండలం లోని సమావేశంలో పార్టీ మండల కమిటీ సభ్యులు తటోజు రవీంద్రచారి నాయకులు బి.కొమురయ్య, గుమ్మడిదల లింగయ్య, మల్లేశం, ఎల్లయ్య, నర్సయ్య, అయిలయ్య, కనకయ్య, రాములు, సిద్దిపేటఅర్బన్ మండల సమావేశంలో పార్టీ మండల కమిటీ సభ్యురాలు దండు లక్ష్మి , సభ్యులు మంజుల, మద్దెల లక్ష్మి, స్వరూప, దేవమ్మ, హరిత, పాల్గొన్నారు.

ప్రీమియం లేకుండానే భీమా..!

-మహిళలు స్వయం సహాయక సంఘాలలో చేరాలి

-హుస్నాబాద్ ఏపీఎం అంబాల బిక్షప



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

స్వయం సహాయక సంఘాలలో చేరే ప్రతి మహిళకు ప్రీమియం డబ్బులు లేకుండానే బీమా సౌకర్యం ఉంటుందని హుస్నాబాద్ ఏపీఎం అంబాల బిక్షపతి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని 18 నుంచి 60 ఏండ్ల మహిళలందరు స్వయం సహాయక సంఘాలలో చేరలని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘంలో ఉన్న ప్రతి మహిళా సభ్యురాలికి లోన్ భీమా, ప్రమాద భీమా వర్తిస్తుందన్నారు. సంఘం నుంచి ఋణం పొందిన అర్హత కల్గిన సభ్యురాలు సాధారాణంగా (సహజ) మరణిస్తే ఆమె మరణించే నాటికి ఉన్నా అప్పునిల్వ సంఘం ఎస్‌బి అకౌంట్‌లో జమ అవుతుందన్నారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ .2 లక్షల లోన్ భీమా, ప్రమాదవశాత్తు మరణిస్తే నామిని అకౌంట్‌లో రూ.10 లక్షలు జమ అవుతుందన్నారు. ప్రమాదంలో 100శాతం అంగవైకల్యం అయితే రూ.10 లక్షలు సభ్యురాలు అకౌంట్ జమ అవుతుందన్నారు. సంఘంలో సభ్యులు అయితే ప్రీమియం చెల్లించే అవసరం లేదన్నారు. గ్రామాల్లో 18 ఏండ్లు నిండిన వారిని గుర్తించి సంఘలలో చేరెందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఆకట్టుకుంటున్న సైన్స్ ఫెయిర్

- ప్రాజెక్టుల సందర్శనకు వేలాదిగా తరలివచ్చిన విద్యార్థులు
- ప్రాజెక్టులను పరిశీలిస్తున్న జడ్జీలు



నవతెలంగాణ-సిద్దిపేట

52వ జాతీయ సైన్స్ ఫెయిర్, ఇన్స్పైర్ ప్రాజెక్టులు ఆలోచింపచేస్తున్నాయి. రెండో రోజు ప్రాజెక్టులను సందర్శించడానికి ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల నుంచి వేలాదిగా విద్యార్థులు రావడంతో ప్రభుత్వ బాలికల పాఠశాల జన సందోహంగా మారింది. రాష్ట్రస్థాయికి ప్రాజెక్టులను ఎంపిక చేయడం కోసం జడ్జిలు ప్రతి ప్రాజెక్టును సందర్శిస్తూ వివరాలను రాసుకుంటున్నారు. జిల్లా సైన్స్ అధికారి కల్లేపల్లి శ్రీనివాస్ విద్యార్థులకు, సందర్శకులకు ఎక్కడ లోటు లేకుండా పర్యవేక్షిస్తున్నారు.

ప్లాస్టిక్ రీసైక్లింగ్..

సమాజంలో ప్లాస్టిక్‌తో ఎంతో హాని కలుగుతుందని, కొత్త ప్లాస్టిక్‌ను తయారు చేయకుండా, వాడిన ప్లాస్టిక్‌ను రీసైకిలింగ్ ద్వారా తక్కువ ఖర్చుతో మనకు కావలసిన విధంగా తయారు చేసుకునే విధానాన్ని మర్కుక్ కేజీబీవీ పాఠశాల విద్యార్థిని సాయి శ్రీదేవి, గైడ్ టీచర్ మంజులతో కలిసి ప్రదర్శించారు.

భగీరథ పైప్ లైన్ లీకేజ్ తెలియజేసే యంత్రం..

ఇంటింటికి మంచినీటిని పంపిణీ చేసే మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజ్ అయిన వెంటనే ఆటోమెటిక్ వాయిస్ ఇన్ఫర్మేషన్ పరికరాన్ని శ్రీ వర్షిని విద్యార్థిని, గైడ్ టీచర్ దేవయ్య సహాయంతో ప్రదర్శించారు. వీరికి సహాయంగా పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, విజయేందర్ రెడ్డి, భూపాల్‌లు సహకరించారు.

సృజనాత్మక శక్తితో మంచి గుర్తింపు

- జిల్లా సెక్టోరియల్ అధికారి భాస్కర్



నవతెలంగాణ-మిరుదొడ్డి

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీస్తే దాంతో సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని జిల్లా సెక్టోరియల్ అధికారి భాస్కర్ అన్నారు. రూమ్ టు రీడ్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయన అభినందించారు. మిరుదొడ్డి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రశంసా పత్రాలను ఎంఈఓ ప్రవీణ్ బాబుతో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూమ్ టు రీడ్ నేతృత్వంలో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి దేశంలో తెలంగాణ రాష్ట్రంతో పాటు రాజస్థాన్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లోని మూడు ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. అందులో తెలంగాణ రాష్ట్రం నుంచి మిరుదొడ్డి ప్రాథమిక పాఠశాల, సంగారెడ్డి జిల్లాలోని నందికంది ప్రాథమిక పాఠశాలలు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికయ్యాయన్నారు. ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో మిరుదొడ్డి ప్రాథమిక పాఠశాల నుంచి 20 మంది విద్యార్థులు పాల్గొనడం, అందులో పది మంది విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకురావడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ వెంకట రాజలింగం, ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ పద్మావతి, రూమ్ టు రీడ్ మండల కోఆర్డినేటర్ మధు, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీదేవి, ఇరుకుల్ల శ్రీనివాస్, రమేష్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ పరిశ్రమలను రద్దు చేయాలి

- సీపీఐ(ఎం)మండల కార్యదర్శి శ్రీనివాస్



నవతెలంగాణ-బెజ్జంకి

మానవ మనుగడకు విషం చిమ్మే మండల పరిధిలోని గుగ్గిల్ల, పోతారం గ్రామ శివారుల్లో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమలను రద్దు చేయాలని సీపీఐ(ఎం)మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో సీపీఐ(ఎం) కార్యవర్గ సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లోని ఇథనాల్ పరిశ్రమను రద్దు చేసిన ప్రభుత్వం నిష్పక్షపాతంగా మండలంలో నిర్మిస్తున్న పరిశ్రమలను రద్దు చేయాలని సీపీఐ(ఎం)పక్షాన డిమాండ్ చేశారు. స్థానిక రైతాంగ భవిష్యత్తుకు ముప్పు వాటిల్లకుండా ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ వహించి ఇథనాల్ పరిశ్రమలను ప్రభుత్వం రద్దు చేసేల చోరవచూపాలని కోరారు. శాసనసభ ఎన్నికల సమయంలో అప్పటి బీఆర్ఎస్ మంత్రి తన్నీరు హరీశ్ రావు, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఇథనాల్ పరిశ్రమల రద్దు చేసేల పోరాటం చేస్తామని ఇచ్చిన హామీని గుర్తు చేశారు. దిలావర్‌పూర్ రైతాంగ పోరాట స్ఫూర్తితో ఇథనాల్ పరిశ్రమల పరిసర ప్రాంతాల రైతులు చిత్తశుద్ధితో పోరాటాలు చేయాల్సిన ఆవశ్యకత నెలకొందని సూచించారు. మండలంలోని ఇథనాల్ పరిశ్రమలను ప్రభుత్వం బేషరుతుగా రద్దు చేయాలని, లేని పక్షంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బలమైన పోరాటాలు చేపట్టి ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పార్టీ మండల కమిటీ సభ్యులు బొమ్మిడి సాయిక్రిష్ణ, సంఘ ఎల్లయ్య, బోనగిరి లింగం,పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం అక్కెనపల్లి గ్రామానికి చెందిన జర్నలిస్టు సిల్వేరి కృష్ణ తల్లి పెద్దలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతు మృతి చెందింది. విషయాన్ని తెలుసుకున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు శుక్రవారం వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. తల్లి మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు గోనెపల్లి యాదగిరి భార్య మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ శాఖ మాజీ అధ్యక్షులు కీ॥శే॥ జగ్గని రామచంద్రం కుమారుడి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్లు ఎడ్ల సోమిరెడ్డి, రాగుల సారయ్య, సొసైటీ చైర్మెన్ ఎల్లంకి మహిపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బెదురు తిరుపతి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు అనగోని లింగం గౌడ్, నాయకులు తిప్పని నాగేందర్ హాజరైనారు.

కేసీఆర్ లేనిదే తెలంగాణ రాష్ట్రం లేదు

నవతెలంగాణ-మద్దూరు

కేసీఆర్ లేనిదే తెలంగాణ రాష్ట్రం లేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మేక సంతోష్ కుమార్ అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన దీక్ష దివాస్ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం తెచ్చేందుకు కేసీఆర్ ఎంతో కొట్లాడాడని తన ప్రాణాన్ని సైతం పణంగా పెట్టిన వ్యక్తి అని తెలిపారు. కేసీఆర్ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఆంధ్ర నాయకుల మోచేతి నీళ్లు తాగిన కాంగ్రెస్ ,బీజేపీ, నాయకులు పదవులు అనుభవిస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన పై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వంగ భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు దామెర మల్లేశం, నాయకులు బొల్లు చంద్రమౌళి, మేక గోపాల్, నర్సింలు, బాల్ రెడ్డి, నాగయ్య సాయిలు, షకీల్, ఫయాజ్ , తదితరులు పాల్గొన్నారు.



సమాజ మార్పులో పీడీఎస్‌యూది కీలక పాత్ర

- ప్రముఖ కవి నందిని సిద్ధారెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేట

సమాజ మార్పులో పీడీఎస్‌యూ కీలక పాత్ర పోషిస్తుందని ప్రముఖ కవి నందిని సిద్ధారెడ్డి అన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆవిర్భవించి యాభై ఏండ్లు అయినా సందర్భంగా శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో శివానుభవ మండపంలో అర్ధ శతాబ్దోత్సవ సభ పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు గౌతమ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రగతిశీల విద్యార్థి ఉద్యమాల దిక్సూచి పీడీఎస్‌యూ అని అన్నారు. పది దశాబ్దాలుగా శాస్త్రీయ విద్య సాధన కోసం, పేద ధనిక తేడా లేని కామన్ స్కూల్ విద్యా విధానం కోసం పీడీఎస్‌యూ నిరంతరం ఉద్యమిస్తుందని అన్నారు. విద్యారంగ సమస్యలకే పరిమితం కాకుండా అనేక పౌర, ప్రజాస్వామిక ఉద్యమాల్లో పాలుపంచుకున్నదని అన్నారు. యాభై ఏండ్ల సుదీర్ఘ ప్రస్థానంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని, ఎన్నో త్యాగాలు చేసిందని, జార్జిరెడ్డి, జేసీఎస్ ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, కోలా శంకర్, చేరాలు, రంగవల్లి, మారోజు వీరన్న, స్నేహలత లాంటి విప్లవ వీరకిషో రాలు అమరత్వం చెందారని గుర్తు చేశారు. సినిమా నటుడు అభయ్ నవీన్ మాట్లాడుతూ జార్జిరెడ్డి ఎంతో మంది విద్యార్థులకు స్ఫూర్తిదా యకమన్నారు. జార్జి రెడ్డి తనను ఎంతగానో ప్రభావితం చేశాడని అన్నారు. పేద విద్యార్థుల పక్షాన చివరి శ్వాస వరకు నిలబడ్డా గొప్ప వ్యక్తి అన్నారు. అదే విధంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ఉపాధ్యక్షులు తిరుపతి రెడ్డి మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాల పై విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమాజంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ పూర్వ ప్రస్తుత విద్యార్థులు శ్రీకాంత్, ప్రేమ్, స్వామి, దేవులపల్లి రమేష్, ఉదయ్, రాణా ప్రతాప్, రవి తేజ, నిరంజన్, పర్శరాములు పాల్గొన్నారు.

దొరల పాలన నుంచి తెలంగాణకు విముక్తి కలిగింది

- కాంగ్రెస్ మండల అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్




నవతెలంగాణ-సిద్దిపేట

నీళ్లు, నిధులు, నియామకాలు అనే ఉద్దేశ్యంతో ఏర్పాటైనా తెలంగాణ రాష్ట్రన్ని తమ స్వార్థ రాజకీయాల కోసం, తెలంగాణ సంపదను దోచుకున్న దొరల పాలనకు తెలంగాణ ప్రజలు విముక్తి పలికారని కాంగ్రెస్ చిన్నకోడూరు మండల అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ జీర్ణించుకోలేక బీఆర్ఎస్ నాయకులు దీక్షా దివస్ పేరుతో దొంగ దీక్షలు చేయడం సిగ్గుచేటన్నారు. వారు అధికారంలో ఉన్నప్పుడు ధర్నా చౌక్ ఎత్తి వేసి కనీసం నిరసన తెలియజేయకుండా చేసిన దొంగలు, ఇప్పుడు దీక్షదివాస్ పేరు తో దొంగ దీక్షలు చేసి ప్రజలనుమభ్యపెట్టాలని చూస్తే, ప్రజలే బీఆర్ఎస్ పార్టీని పాతాళానికి తొక్కుతారన్నారు. 4 కోట్ల జనాభా 60 ఏండ్ల తెలంగాణ రాష్ట్ర కళ సహకారమయ్యేలా సోనియా గాంధీని ఒప్పించారని, పార్లమెంట్‌లో ఏక లింగం గా వున్నా అప్పటి తెరాస ఎంపీ కేసీఆర్ వల్ల తెలంగాణ ఏర్పాటు జరగలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల ఉప అధ్యక్షులు సందబోయిన పర్శరాం, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ కొమ్ము ప్రశాంత్, జిల్లా నాయకులు మంత్రి సురేందర్, నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పేరిట ప్రజలను దోచిన బీఆర్ఎస్

- పదేళ్లలో ప్రజల జీవితాల్లో చీకటి నింపిన బీఆర్ఎస్
- అప్పుల ఊబిలో తెలంగాణ రాష్ట్రం
- కుటుంబ పాలనకు చరమగీతం పాడిన ప్రజలు
- కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఊడేంసారిక శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే బాగుపడతామని భావించిన రాష్ట్ర ప్రజలు చివరకు మోసపోయారని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఊడెం సారిక శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ప్రజలపై బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రభావాన్ని నవతెలంగాణతో వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దగబడ్డ తెలంగాణ కోసం మాజీ సీఎం కేసీఆర్ అంతా మంచే చేస్తాడని తెలంగాణ ప్రజలు నమ్మి మోసపోయారన్నారు. అభివృద్ధి పేరిట పేదలకు ఎంతో అన్యాయం చేశారని పేర్కొన్నారు. నిధులు, నియామకాలు అంటూ చాపకు ఏరవేసి తిమింగలాన్ని కొట్టుక పోయిన విషయం అందరికి తెలిసిందేనని వ్యాఖ్యానించారు. గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల, జిల్లాలలో ఎంతో కొంత అభివృద్ధిని చూపించి రాష్ట్రాన్ని మొత్తం అప్పుల ఊబిలోకి లాగారన్నారు. తెలంగాణ రాష్ట్రం మీద బీఆర్ఎస్ అధికారం ఉందని ఇష్టరీతిన వ్యవహరించారన్నారు. అడుగడుగున అప్పులు చేస్తూ మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం కోట్లు గడిగించిం దన్నారు. ఏ అభివృద్ధి పనులు మొదలు పెట్టిన కాంట్రా క్టర్లతో కుమ్మకై కమీషన్లకు కక్కుర్తి పడి, రాష్ట్ర ప్రజల బతుకు లు చిన్నాభిన్నం చేశారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో మాజీ సీఎం కుటుంబ ఆర్థిక సంపద రూ.లక్షల కోట్లలకు వెళ్లిందని మండిపడ్డారు. పేదల బ్రతుకులతో ఆడుకున్న కుటుంబానికి ఓటుతో ప్రజల గుణపాఠం చెప్పారని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో కొలువు తీరడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నార న్నారు. గెలిచిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తానన్న సీఎం రేవంత్ రెడ్డి హామీ సంపూర్ణంగా అమలవుతుం దన్నారు. రాబోయే రోజుల్లో పేద, బడుగు, బల హీన, వర్గాల కోసం సీఎం రేవంత్ రెడ్డి అహ ర్నిశలు పనిచేస్తున్నారని ఆశ భావం వ్యక్తం చేశా రు. ఆరు గ్యారెంటీల్లో రూ.వేల కోట్లు వెచ్చించి రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కుతుందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు అయిన రుణమాఫీ, మళ్లీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అమలయిందన్నారు. పదేళ్లలో రైతుబంధు, రైతు బీమా, అంటూ భూస్వాములకు కొమ్ము కాసిన బీఆర్ఎస్ రుణమాఫీ ఊసు ఎందుకు తీయలేదని పేర్కొన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామపంచాయతీ మున్సిపల్, అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

పాఠశాలను సందర్శించిన ఎడ్యుకేషన్ కమిషన్ సభ్యులు

నవతెలంగాణ-మర్కుక్



మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను శుక్రవారం రాష్ట్ర ఎడ్యుకేషన్ కమిషన్ సభ్యులు జ్యోతి రెడ్డి కమిషన్ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం విద్యార్థుల సామర్థ్యాలను ఆంగ్లమ విద్య బోధనపై సమగ్ర సమాచారాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశంను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజన అమలు విధానాన్ని ప్రత్యేకంగా పరిశీలించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా వంట పాత్రలు, వంట గదిని శుభ్రంగా ఉంచుకోవాలని మధ్యాహ్న భోజన కార్మికులకు సూచించారు. వంట గదికి రంగులను వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పీఆర్టీయూ అధ్యక్షులు శ్రీనివాసరావు, సీఆర్పీ నాయక్, ఉపాధ్యాయులు గణేష్, విద్యార్థులున్నారు

చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా చేయాలి

-జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖకు వినతి

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాలను రెవిన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖను హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. చేర్యాల ప్రాముఖ్యత, అస్తిత్వం కోల్పోయిన విధానం, మండలాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను మంత్రికి వివరించినట్లు కిరణ్ కుమార్ తెలిపారు. చేర్యాల ప్రాంతానికి పునర్వైభవం రావాలంటే ఈ ప్రాంత ప్రజల ఆకాంక్ష అయిన రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. ఈ విషయం సంబంధిత మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో మాట్లాడుతానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

అమరవీరుల స్థూపానికి నివాళులర్పించిన ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-సిద్దిపేట



దీక్ష దివస్ సందర్భంగా పట్టణంలోని అమరవీరుల స్థూపానికి మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డిలు నివాళులు అర్పించారు. అంతకుముందు కోటిలింగాల దేవాలయం వద్ద గల తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం నవంబర్ 29న మాజీ సీఎం కేసీఆర్ అమర్న నిరాహార దీక్ష చేపట్టిన సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు ఆరోజును దీక్ష దివస్‌గా పాటిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, రాజనర్సు, కొండం సంపత్ రెడ్డి, మచ్చ వేణుగోపాల్ రెడ్డి, నాగిరెడ్డి, వినోద్ గౌడ్, నాయకం లక్ష్మణ్, మేర సత్తయ్య, సురేష్, సుందర్, కార్యకర్తలు, పాల్గొన్నారు.

కేజీబీవీలో నల్ల బ్యాడ్జీలతో నిరసన

నవతెలంగాణ-మద్దూరు



సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని కేజీబీవి పాఠశాలలో భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి ఎస్ఓ, సీఆర్‌టీలు నిరసన తెలిపారు. వారి నిరసనకు మద్దతుగా టీఎస్ యూటీఎఫ్ మద్దూరు మండల అధ్యక్షులు రంగు రాజమల్లు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమానపనికి సమాన వేతనం అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని తెలిపారు.

బీజేవైఎం నాయకుల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-మద్దూరు



తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ బీసీ గురుకులాల్లో నిత్యం విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై బీజేపీ ఆధ్వర్యంలో సంజీవయ్య భవన్ ముట్టడికి పిలుపునివ్వడంతో ముందస్తుగా బీజేవైఎం రాష్ట్ర నాయకులు మనోజ్ కుమార్, బీజేవైఎం మండల నాయకులు బాలకృష్ణ, సందీప్, సతీష్‌లను ముందస్తు అరెస్టు చేసినట్లు ఎస్సై షేక్ మహబూబ్ తెలిపారు.

పాలమాకుల రైతు వేదికలో రైతుల పండుగ

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలంలోని పాలమాకుల రైతు వేదికలో శనివారం మధ్యాహ్నం 2.00 గంటలకు రైతుల పండగ నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి గీత తెలియజేశారు. ప్రజా పాలన విజయోత్సవంలో భాగంగా నేడు రైతుల పండగ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. నంగునూరు మండలంలోని రైతులు అందరు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అసెంబ్లీ స్పీకర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-సిద్దిపేట



రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు బొమ్మల యాదగిరి, ఎండి షాబుద్దీన్, మిద్దె ప్రసాద్‌లు హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సన్మానించారు.

ఎమ్మార్పీఎస్ కమిటీల ఎంపిక



నవతెలంగాణ-అక్కన్నపేట

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల బాధ్యులను ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు, అక్కన్నపేట మండల ఇంచార్జ్ పెరిక పరశురాములు మాదిగ శుక్రవారం ప్రకటించారు. మహాజన సోషలిస్ట్ పార్టీ మండల కన్వీనర్ జన్నే రవి మాదిగ, కో కన్వీనర్ గంగారపు కొమురయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ ముత్యాల శ్యామ్ కిరణ్ మాదిగ, కోకన్వీనర్ బాకె రాజయ్య మాదిగ, చుంచు బిక్షపతి మాదిగ, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఎంఎస్ఎఫ్ జాల అజయ్ మాదిగ, బిచ్చాల బాన్నీ ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా సీనియర్ నాయకులు లింగంపల్లి శ్రీనివాస్ మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రకాష్ సామ్రాట్ మాదిగ, నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ మాట్ల వెంకటస్వామి మాదిగ, తొందూరి ఎల్లయ్య బహుజన్, ముక్కెర సంపత్ కుమార్ మాదిగ, మారెపల్లి తిరుపతి, బాకే వెంకటేష్, తదితరులు, పాల్గొన్నారు.

బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-కొమురవెల్లి



బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మెన్ బొంగు రాజేందర్ రెడ్డి పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. శుక్రవారం కొమురవెల్లి మండల కేంద్రంలో ఆయన పుట్టినరోజు సందర్భంగా దుప్పట్లు పంపిణీ చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ కోసం ఉద్యమనాయకుడు కేసీఆర్ దీక్షా చేపట్టిన రోజు తన పుట్టిన రోజు కావడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ స్ఫూర్తితో పేదలకు అండగా ఉంటానన్నాడు. అనంతరం అభిమానుల సమక్షంలో పుట్టిన రోజు వేడుకలు చేసుకున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



హుస్నాబాద్ మండలంలోని మడద గ్రామానికి చెందిన బండారి స్వాతికి శుక్రవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ వైస్ చైర్మెన్ బంక చందు రూ.84 వేల సీఎం రిలీఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్లను సందర్శించిన ఫుడ్ కమిటీ


నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్



హుస్నాబాద్ పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాల, పోతారం ఎస్ గ్రామ పరిధిలోని మహాత్మ జ్యోతిరావు పూలే కస్తూర్బా పాఠశాలలను శుక్రవారం ఫుడ్ కమిటీ అధికారులు సందర్శించారు. హాస్టల్లలోని కిచెన్, స్టోర్ రూమ్, భోజన శాలను పరిశీలించారు. హాస్టల్ యొక్క పరిశుభ్రత, మంచినీటి సౌకర్యం, మూత్రశాలల నిర్వహణను ప్రత్యేకంగా పరిశీలించారు. విద్యార్థులకు అందించే మెన్ యొక్క వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిత్యం విద్యార్థులకు అందించే భోజనం, వంటకాల తయారీని పరిశీలించి భోజనాన్ని టెస్ట్ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలల్లో పరిశుభ్రత తప్పకుండా పాటించాలని సూచించారు. ఫుడ్ కమిటీ సభ్యులు తహసీల్దార్ రవీందర్ రెడ్డి, కమిషనర్ మల్లికార్జున్, ఎంఈఓ మనీల, మెడికల్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

విధుల పట్ల అధికారుల నిర్లక్ష్యం

- క్షేత్రస్థాయిలో పర్యటన పేరుతో విధులకు ఎగనామం
- అస్తవ్యస్తంగా ఎంపీడీవో కార్యాలయంలో అధికారుల పనితీరు
- విధులకు హాజరు కాకుండా హాజరైనట్టు రిజిస్టర్లో సంతకాలు
- మూడేండ్లుగా మూమెంట్ రిజిస్టర్ నమోదు చేయని అధికారులు
- ఆఫీసులో చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న సందర్శకులు



అధికారులు లేక ఖాళీగా ఉన్నా కార్యాలయం...



12 :47 గంటలకు కార్యాలయానికి వస్తున్నా ఎంపీఓ

నవతెలంగాణ-మద్దూరు

మండల ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే మండల పరిషత్ కార్యాలయం అధికారులు విధులకు హాజరుకాకుండానే హాజరైనట్టు హాజరు రిజిస్టర్‌లో సంతకాలు చేస్తూ ప్రభుత్వాన్ని, ప్రజలను మోసం చేస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తు న్నారు. మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఎంపీడీవో, ఎంపీవో, జూనియర్ అసిస్టెంట్‌లు విధులు నిర్వర్తించకుండా మండల పరిషత్ కార్యాలయానికి రాకున్నా క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నామని సాకుతో విధులకు ఎగనామం చేస్తున్న అధికారులు. ఎంపీడీవో, ఎంపీఓ, మండల కేంద్రంలోని కార్యాలయానికి విధులకు హాజరు కాకుండా గ్రామాలలో పర్యటనలు చేస్తున్నామని చెప్పేసుకుంటూ విధులకు హాజరు కావడం లేదు మండల స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసే అధికారులు. మండల కేంద్రానికి వచ్చి మూమెంట్ రిజిస్టర్‌లో ఆ అధికారి ఏ గ్రామానికి వెళ్తున్నాడు. మూమెంట్ రిజిస్టర్లు నమోదు చేయాల్సి ఉంటుంది. కానీ మండల పరిషత్ కార్యాలయంలో మూడేండ్లుగా మూమెంట్ రిజిస్టర్ ఓపెన్ కూడా చేయకుండా ఖాళీ పేజీలతో దర్శనమిస్తుంది. ఇదిలా ఉండగా కార్యాలయంలో పనిచేస్తున్న ఎంపీఓ, మండలంలోని గ్రామపంచాయతీల పనితీరును పర్యవేక్షించాల్సిన ఎంపీఓ, పై అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విధులకు ఎగనామం పెడుతూ విధులకు హాజరుకాకుండానే రెండు మూడు రోజులకు ఓసారి విధులకు హాజరవుతూ ఒక్కసారి రిజిస్టర్లో సంతకాలు చేస్తున్నాడు. ఎంపీఓ సమయపాలన పాటించకుండా విధులకు హాజరవ్వడం పట్ల మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. కార్యాలయంలో రికార్డుల నమోదు చేసుకునే జూనియర్ అసిస్టెంట్ కార్యాలయంలో ఉండకుండా ఎంపీడీవోతో కలిసి గ్రామాల్లో పర్యటిం చడం పట్ల మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎంపీడీవో, ఎంపీవో, జూనియర్ అసిస్టెంట్‌ల పై జిల్లా స్థాయి అధికారులు వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బయోమెట్రిక్ విధానం అమలు చేయాలి



మండల పరిషత్ కార్యాలయంలో విధులకు హాజరు కాని అధికారుల పట్ల ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్యాల యాల్లో వెంటనే బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తే ప్రజలకు సులువైన పాలన అందుతుంది.

-సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎండి షఫీ

కార్మిక వర్గాల ఆశాదీపం 'సీపీఐ(ఎం)'

-సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి పిలుపు

నవతెలంగాణ-గజ్వేల్



సీపీఐ(ఎం) ప్రస్థానంలో సిద్దిపేట జిల్లాలోని పారిశ్రామిక కేంద్రంలోని కార్మికుల సంక్షేమానికి, ఉద్యోగ భద్రతకు కార్మికుల గొంతుకగా ఉంటూ అనుక్షణం కార్మికులను చైతన్య పరుస్తూ కార్మిక వర్గాల "ఆశాదీపం" గా కార్మికుల సంక్షేమానికి నిరంతరం పోరాటం చేస్తున్న సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా మూడో మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి కార్మిక వర్గాలకు పిలుపునిచ్చారు. గజ్వేల్‌లోని స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్‌లోని కార్మికుల సమస్యలను వెలుగులోకి తేవడం ద్వారా చాల పరిశ్రమలలో పీఎఫ్, ఈఎస్ఐ లాంటివి యాజమాన్యం చెల్లించే విధంగా కృషి చేసిన పార్టీ సీపీఐ(ఎం) అని అన్నారు. యాజమాన్యం వేధింపులతో విధులకు అనుమతించకపోతే కార్మికులు చేసిన పోరాటానికి మద్దతు ఇవ్వడంతో పాటు అధికారుల జోక్యంతో సమస్య పరిష్కారానికి చొరవ చూపిన పార్టీ సిపిఎం అని అన్నారు. గజ్వేల్ ,కరకపట్ల, వర్గల్, ములుగు ప్రాంతాలలోని పరిశ్రమలలో కార్మికులకు ఉద్యోగ భద్రత, సంక్షేమ సౌకర్యాలు, లేబర్ కోడులను వ్యతిరేకించిన పార్టీ సీపీఐ(ఎం) అన్నారు. అసంఘటిత రంగ కార్మికులైన హమాలీ, ట్రాన్స్ పోర్ట్ ,భవన నిర్మాణ కార్మికుల స్థితిగతులపై ప్రభుత్వ, అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారు శ్రమ దోపిడీ గురికాకుండా వారి సంక్షేమానికి ప్రభుత్వం తీసుకునే పథకాలు కార్మికులకు అందే విధంగా వీటితో పాటు స్కీం వర్కర్లు అయిన అంగన్వాడి,ఆశ,మధ్యాహ్న భోజనం,ఐకెపి, మెప్మా, గ్రామ పంచాయితీ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి సీపీఐ(ఎం) అనేక పోరాటాలు చేసిందన్నారు. కార్మిక వర్గ సంక్షేమమే ఏకైక లక్ష్యంగా ఎంచుకొని పనిచేస్తున్న సిపిఎం పార్టీని అన్ని రంగాల కార్మిక వర్గాలు ఆదరించాలన్నారు.

రైతాంగానికిచ్చిన వాగ్దానానికి ప్రభుత్వం కట్టుబడుంది

- మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

నవతెలంగాణ-బెజ్జంకి



ఎన్నికల సమయంలో రాష్ట్ర రైతాంగానికిచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ వాగ్దానానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుబడుందని, అయా బ్యాంకుల తప్పిదాల వల్ల రుణమాఫీ వర్తించని రైతాంగానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెక్కులందజేసి వాగ్దానం నెరవెర్చడానికి కృషి చేస్తున్నారని మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భం ఆయన మాట్లాడుతూ సాగు చేయని భూములకు, గుట్టలకు గత ప్రభుత్వం రైతు బంధు అందించి ప్రజా ధనాన్ని విచ్చలవిడిగా నీళ్లపాలు చేసిందని మండిపడ్డారు. ప్రతి పైసా దుర్వినియోగమవ్వకుండా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తగు జాగ్రత్తలు వహిస్తూ పంటలు సాగు చేస్తున్న భూములకు రైతు భరోసా అందించేల ప్రణాళికలు రుపోందిస్తుందన్నారు. నిర్దేశిత భూములకు సంక్రాంతి వరకు ప్రభుత్వం రైతు భరోసా అందజేయనున్నదన్నారు. రైతును రాజును చేయాలని మాటల్లో కాకుండా చేతల్లో చేయాలని సదుద్దేశ్యంతో ప్రభుత్వం సన్న రకం వడ్లకు మద్దతు ధరకు చెల్లించి రూ.500 బోనస్ రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తుందన్నారు. వడ్ల కొనుగోలు వివరాలను ఏపీఎం నర్సయ్యను అడిగి తెలుసుకున్నారు. ప్రజా పాలన,రైతు విజయోత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఏఎంసీ చైర్మెన్ పులి క్రిష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, వైస్ చైర్మెన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు పులి సంతోష్, మచ్చ కుమార్, నాయకులు శానగొండ శరత్, బైర సంతోష్, జెల్లా ప్రభాకర్, పోతిరెడ్డి మధు సూదన్ రెడ్డి, చెన్నారెడ్డి, సాధిక్, మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య ఉప సర్పంచ్ కుంట హరికృష్ణ పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

మండల పరిధిలోని తలారివాని పల్లి, వడ్లూరు, బేగంపేట, నర్సింహులపల్లి, దేవక్కపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కాంగ్రెస్ నాయకులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టేల అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలని ఎమ్మెల్యే సూచించారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక దిగుబడి

నవతెలంగాణ-జగదేవపూర్



ఆయిల్ పామ్ పంట సాగుతో అధిక ఆదాయం లభిస్తుందని మండల వ్యవసాయ అధికారి వసంతరావు అన్నారు. శుక్రవారం జగదేవపూర్ మండలం తీగల్ గ్రామంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయిల్ పామ్ పంటలో అంతర పంటలుగా కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్న రైతు మల్లేశం తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు 80-90 శాతం, ఎస్సీ ఎస్టీ రైతులకు 100 శాతంపై డ్రిప్ పరికరాలు అందిస్తారని అలాగే మొక్కలపై 90 శాతం సబ్సిడీ పై అందించటం జరుగుతుందని అన్నారు. ఆయిల్ పామ్ చెట్లు నాటిన 14 నెలలకు పూత ప్రారంభమై మొక్క 30 నెలలు వయసు వచ్చేవరకు లేత దశలో మగ ఆడ గుత్తులను తప్పనిసరిగా తొలగించాలని తద్వారా చెట్ల యొక్క మాను (మొదలు భాగం) బాగా ఊరుతుందని, తద్వారా 36 నెలల వయసులో గెలలు బరువు బాగా వస్తుందన్నారు. ఎకరానికి నికరంగా ప్రతి ఏడాది 10 టన్నుల పామాయిల్ దిగుబడి పొందవచ్చు అని ఐదేళ్ల తర్వాత ఆయిల్ పామ్‌లో కోకో పంట కూడా వేసుకోవచ్చు అన్నారు. ఆయిల్ పామ్ తోటలో మూడు ఏండ్ల వరకు అంతర పంటలుగా మొక్కజొన్న, వేరుశనగ, పత్తి మరియు కూరగాయలు అనేక పంటలు సాగు చేసి అధిక దిగుబడులు పొందవచ్చని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ విజయ్, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు కవిత, భాను ప్రకాష్, రైతులు పాల్గొన్నారు.

దళారులు నమ్మి మోసపోవద్దు

- దుబ్బాక ఏడిఏ మల్లయ్య



నవతెలంగాణ-దౌల్తాబాద్

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారులను నమ్మి మోసపోవద్దని ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం విక్రయించి మద్దతు ధరను పొందాలని దుబ్బాక ఏడిఏ మల్లయ్య అన్నారు. శుక్రవారం మండలం దొమ్మాట, లింగరాజు పల్లి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాతలు రైతులకు మద్దతు ధరను చెల్లించి ధాన్యం కొనుగోలు చేస్తున్నారన్నారు. నాణ్యత పరిణామాలు, తేమ శాతం గురించి రైతులకు వివరించారు. దళారులకు ధాన్యం విక్రయించి రైతులు నష్టపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం రైతుల నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దౌలాబాద్ మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్, వ్యవసాయ విస్తరణ అధికారి సంతోష్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీఆర్‌టీయూ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి

నవతెలంగాణ-సిద్దిపేట



విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీఆర్‌టీయూ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇన్స్పైర్, 52వ వైజ్ఞానిక ప్రదర్శనను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీఆర్టీయూ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగంలో ప్రపంచం పరుగులు తీస్తున్న సమయంలో విద్యార్థి దశ నుంచి శాస్త్రీయ దృక్పథం విద్యార్థులు అలవర్చుకో వాలని, శాస్త్ర సాంకేతికతను ఉపయోగిం చి వాతావరణ కాలుష్యాన్ని తగ్గించి, పర్యా వరణాన్ని పరిరక్షించుకునే విధంగా ఆలోచన ఉండాలని, రైతులకు సమాజా నికి ఉపయోగపడే ఆవిష్కరణలు విద్యా ర్థులు రూపొందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు మల్లు గారి ఇంద్రసేనారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదరాసుపల్లి శశిధర్ శర్మ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నర్రా భాస్కర్ రెడ్డి, ఆస లక్ష్మణ్, లక్కిరెడ్డి విజయ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మనసిక ఉల్లాసానికి దోహదం

- కాంగ్రెస్ నాయకులు సాకి ఆనంద్

నవతెలంగాణ-సిద్దిపేట



క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని, క్రమశిక్షణను నేర్పిస్తాయని కాంగ్రెస్ నాయకులు సాకి ఆనంద్ అన్నారు. సీఎం క్రికెట్ కప్పులో భాగంగా శుక్రవారం పుల్లూరు, ఎల్లాయపల్లి మధ్య జరిగిన మ్యాచ్‌లో ఎల్లాయపల్లి గెలిచిందని, ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నవీన్ రెడ్డి, ముంద్రాయి, రాజ్ గోపాల్ పేట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో రాజ్ గోపాల్ పేట్ గెలిచిందని, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అక్షయ్, ఎస్ఎస్ఆర్ కింగ్స్, ఫ్రెండ్స్ ఐకాన్‌ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఎస్ఎస్ఆర్ కింగ్స్ గెలుపొందిందని, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ తేజ, మోహిన్పుర-11, యువసేన టీంల మధ్య జరిగిన మ్యాచ్‌లో యువసేన టీం గెలిచిందని, ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ వినోద్ నిలిచాడు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు చెంది రెడ్డి నరేందర్ రెడ్డి, నాగేంద్ర బాబు, శివ, నరేష్, నగేష్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష అభయాన్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

నవతెలంగాణ-మిరుదొడ్డి



సమగ్ర శిక్ష అభయాన్ ఉద్యోగులను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలంటూ ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షులు రేణికింది మహేష్ డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. మిరుదొడ్డి మండల వనరుల కేంద్రం వద్ద సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు ప్లకార్డులతో నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 22 వేల మంది ఉద్యోగులను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్న నేటికీ రెగ్యులరైజ్ చేయడం లేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి స్పందించకపోతే రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆమరణ నిరాహార దీక్షకు సైతం వెనుకాడేది లేదని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు కిష్టయ్య, మతిన్, విష్ణు, కృష్ణలత, మంజుల, రాజ్యలక్ష్మి మధు పలువురు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించుకొని చదవాలి

- చేర్యాల సీఐ ఎల్.శ్రీను

నవతెలంగాణ-చేర్యాల



తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించుకొని ఇష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలని చేర్యాల సీఐ ఎల్.శ్రీను అన్నారు. మండల పరిధిలోని ఆకునూరు జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు శుక్రవారం మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాల గురించి, గుడ్ టచ్ బాడ్ టచ్, గంజాయి ఇతర మత్తు పదార్థాలు, ఈవిటీజింగ్ నూతన చట్టాల గూర్చి సీఐ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మహిళల రక్షణకు పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రత్యేక షెడ్యూల్లో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. అవసరం ఉంటే తప్ప సోషల్ మీడియాను ఉపయోగించవద్దని అన్నారు. విద్యార్థి దశ చాలా కీలకమని సక్రమ మార్గంలో వెళ్లేవారు. ఉన్నత స్థాయికి వెళ్తారని, చదువుకునే సమయంలో ఎలాంటి చెడు ఆలోచనలకు తావియ్యకూడదన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే ఎలాంటి వివరాలు తెలుపవద్దన్నారు.నూతన చట్టాలు మహిళల రక్షణకు పెద్దపీట వేయడం జరిగిందని తెలిపారు. సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఐలయ్య, ఉపాధ్యాయులు, హుస్నాబాద్ షీటీమ్ బృందం సదయ్య , హెడ్ కానిస్టేబుల్, మహిళా కానిస్టేబుళ్లు ప్రశాంతి, కానిస్టేబుళ్లు కృష్ణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో కార్తీక వనభోజనాలు

- గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపోలో వనబోజనాల సందడి
- డిపో మేనేజర్ పవన్

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్



ఆర్టీసీ ఉద్యోగులు సోదర భావం, ఒక కుటుంబం అన్న భావనతో కలిసిమెలిసి ఉండాలనే ఉద్దేశంతో ఆర్టీసీ ఎండి వీసీ సజ్జనార్ ఆదేశాల మేరకు కార్తీక వన భోజనాల కార్యక్రమాన్ని నిర్వహించమని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ పవన్ అన్నారు. శుక్రవారం ప్రజ్ఞాపూర్ డిపో ఆవరణలో కార్తీకమాసభన భోజనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వన భోజన కార్యక్రమం ద్వారా ఆర్టీసీ ఉద్యోగులంతా ఆహ్లాదకరమైన వాతావంణంలో కుటుంబ సమేతంగా పాల్గొనడం సంతోషకరమన్నారు. పని ఒత్తిడి మరిచిపోయి అందరి మధ్య స్నేహ సంబంధాలు పెంపొందిం చుకునే అవకాశం ఉంటుందన్నారు. ఉద్యోగులు స్నేహపూర్వక వాతావర ణంలో కలిసిమెలిసి పాల్గొన్నామన్నారు. జీవిత భాగస్వాములతో కలిసి ఉద్యోగుల అభివృద్ధి,సంస్థ అభివృద్ధికి మరింత కృషి చేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో చీఫ్ ఇన్స్పెక్టర్ బాబు నాయక్, సూపరిం డెంట్ పాల్, టీఐ2 మహేశ్వరి,ఉద్యోగులు జయందర్ రెడ్డి,పీఏ రెడ్డి,సందీప్,మహిళ ఉద్యోగులు, పాల్గొన్నారు.

పొలాలను లాక్కుంటూ.. రైతులు అడ్డ కూలీలుగా..

- త్రిబుల్ ఆర్ భూ నిర్వాసితులు ఆవేదన

నవతెలంగాణ-గజ్వేల్

అభివృద్ధి పేరిట పచ్చని పంట పొలాలను లాక్కుంటూ రైతులను అడ్డ కూలీలుగా మారుస్తున్నారని జగదేవ్పూర్, ఇటిక్యాల, నెముటూరు, సామలపల్లి, బేగంపేట్ భూ నిర్వాసితులు మల్లేష్, జోసఫ్, కనకరాజు, కార్తీక్, అంజయ్య, పాపయ్య, సత్తయ్య, మహేష్, రాజ మల్లయ్య అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ సొంత ప్రయోజనాల కోసం గత ప్రభుత్వం తమ భూములను లాక్కునే ప్రయత్నం చేసిందని ఆవేదన చెందారు. కాంగ్రెస్ ప్రభుత్వం రీజనల్ రింగ్ రోడ్డు అలాన్మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు. రీజనల్ రింగ్ రోడ్ బాధితులు అన్ని విధాల నష్టపోతున్నారన్నారు. 2019లో త్రిబుల్ ఆర్ నిర్మాణం కోసం అలాట్మెంట్ జరగగా కొంతమంది రాజకీయ నాయకుల స్వార్థంతో మాజీ సీఎం కేసీఆర్ త్రిబుల్ ఆర్ తనకు అనువుగా ఉంటుందని తన ఫామ్ హౌస్ దగ్గర నుంచి రోడ్డు అలాట్మెంట్ ను మార్చుకున్నారని,ఆర్డీవో కార్యాలయంలో త్రిబుల్ ఆర్ అలాట్మెంట్‌ను మార్చాలని వినతిపత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్‌ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని ఇప్పటికే మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ కాలువలకు తమ భూములు పోయినట్లు తిరిగి త్రిబుల్ ఆర్ రోడ్డు కూడా తమ భూములనే తీసుకోవడం భావ్యం కాదన్నారు.



భేటీ బచావో-భేటీ పడావో కరపత్రాల ఆవిష్కరణ

నవతెలంగాణ-బెజ్జంకి



బాలికలకు అన్ని రంగాల్లో సమాన అభివృద్ధి అవసరమని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ, మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్యనారాయణ భేటీ బచావో -భేటీ పడావో కరపత్రాలను ఆవిష్కరిం చారు.ఏఎంసీ చైర్మెన్ పులి కృష్ణ, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, నాయ కులు ఒగ్గు దామోదర్,శ్రీనివాస్ రెడ్డి, పులి సంతోష్,బైరి సంతోష్, శ్రీనివాస్ రెడ్డి,జెల్లా ప్రభాకర్, తిరుపతి రెడ్డి,మహిళ సాధికారత సభ్యులు పద్మ ఉన్నారు.

కో కన్వీనర్ బాధ్యతల నుంచి తప్పుకున్న ఒగ్గు రాజు



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల రెవిన్యూ డివిజన్ సాధన కోసం ఏర్పాటు చేసిన రెవిన్యూ డివిజన్ సాధన సమితి కో కన్వీనర్ బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి ఒగ్గు రాజు తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జేఏసీకి తమ తెలుగుదేశం పార్టీ మద్దతు ఉపసంహరించుకున్నట్లు పేర్కొన్నారు. రెవిన్యూ డివిజన్ సాధన కోసం రానున్న రోజుల్లో తెలుగుదేశం పార్టీగా నిర్ణయాలు తీసుకొని ఉద్యమాలు చేపడుతామని అన్నారు. డిసెంబర్ 2 న తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మండల కేంద్రంలోని అంగడి బజారులో ఉంటుందని, చేరికల కార్యక్రమం కూడా ఉంటుందని ఆసక్తి కలవారు పార్టీలో చేరి సభ్యత్వం తీసుకోవాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ అభిమానులకు, గతంలో ఉన్న కార్యకర్తలకు, నాయకులకు స్వాగతం పలుకుతున్నామని తెలిపారు.

ప్రభుత్వం పై ప్రతిపక్షాలు విమర్శలు మానుకోవాలి

-కాంగ్రెస్ నాయకులు కిష్టయ్య



నవతెలంగాణ-మిరుదొడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రతిపక్ష నాయకులు విమర్శలు మానుకోవాలని కాంగ్రెస్ నాయకులు కిష్టయ్య అన్నారు. మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి మీడియాతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతిపక్ష నాయకులు కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కి గత ఎన్నికల్లో బుద్ధి చెప్పిన, నేటికీ వారి తీరు మారలేదన్నారు. రేపు మహబూబ్ నగర్‌లో జరిగే సీఎం రేవంత్ రెడ్డి సభకు భారీగా తరలిరావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజు, హర్షద్, నాగులు, సత్యం, సత్యనారాయణ, దినకర్, మల్లేశం, నరేష్, రాజిరెడ్డి పలువురు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాలు విజయవంతం



నవతెలంగాణ-గజ్వేల్

చెకుముక్కు సైన్స్ సంబరాలు విజయవంతంగా ముగిసినట్లు జన విజ్ఞాన వేదిక తెలంగాణ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు తుమ్మ సత్యం, ప్రధాన కార్యదర్శి కనకరాజు అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. 2024 విద్యాసంస్థలం జన విజ్ఞాన వేదిక అద్దంలో తెలంగాణ ప్రభుత్వ సమగ్ర శిక్ష సహకారంతో నవంబర్ మొదటి రోజు నుండి 28 వరకు నిర్వహించిన చెక్కుముఖి సైన్స్ సంబరాలను విజయవంతంగా నిర్వహించుకున్నామని దీనికి మీడియా కృషి అభినందనీయమన్నారు. ఆయా పాఠశాలలో 24500 మంది విద్యార్థులు, మండల స్థాయిలో 820 మంది, జిల్లా స్థాయిలో 171 మందు విద్యార్థులు పాల్గొన్నారని వారు వివరించారు. రాబోయే రోజుల్లో సైన్స్ ప్రచారం ఉద్యమంలో ఇదే స్ఫూర్తిని ముందుకు తీసుకుపోవాలని మూఢనమ్మకాల నిర్మూలనలో మనమందరం ముందు ఉండాలని వారు పిలుపునిచ్చారు. సమాజాన్ని చైతన్య పరుచడానికి కృషి చేయాలన్నారు.

కొండపోచమ్మ ఆలయ హుండీ లెక్కింపు



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండలం పరిధిలోని తీగుల్ నర్సాపూర్ సమీపంలోని గల శ్రీ కొండపో చమ్మ అమ్మవారి ఆలయ హుండీ ని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం లెక్కిం చారు. భక్తులు వివిధ కనుకల రూపంలో అమ్మవారికి హుండీలో డబ్బులు వేసి ముడుపులు చెల్లించుకున్నారు. అమ్మవారికి 130 రోజులకు రూ.8,33,393 హుండీ ద్వారా ఆదాయం వచ్చినట్లు ఉమ్మడి మెదక్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఆలయ ఈవో రవి కుమార్, దేవాదాయ శాఖ ఇన్ స్పెక్టర్ రంగా రావు తెలిపారు. అమ్మవారికి కానుకలు రూపంలో వచ్చిన ఆదాయంను అమ్మవారి ఆలయ ఖాతాలో జమ చెయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రజీత రమేశ్, డైరెక్టర్‌లు చెక్కల నరేశ్, ఆగమల్లు, కోట ఆశయ్య, ఆలయ సిబ్బంది మహేందర్ రెడ్డి, కనకయ్య, పూజారులు మల్లయ్య, లక్ష్మణ్, కొండయ్య, తిరుపతి, గోవర్ధన్ ఉన్నారు.

ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా..?



నవతెలంగాణ- గజ్వేల్

గురుకులాల సమస్యలు తీర్చాలని అడిగినందుకు అరెస్టు చేస్తారా..? అని బీజేపీ గజ్వేల్ మండల అధ్యక్షులు అశోక్ గౌడ్, పట్టణ అధ్యక్షులు మనోహర్ యాదవ్ అన్నారు. శుక్రవారం తెల్లవారుజామున ఇంటి వద్ద అరెస్టు చేసి గజ్వేల్ పోలీస్ స్టేషన్ తరలించారు. గురుకులాల్లో తరచు ఫుడ్ పాయిజన్ జరిగిన ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అడిగినందుకు అరెస్టు చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. గురుకులాల్లో పెట్టిన అన్నం తిని శైలజ అనే విద్యార్థి ప్రాణాలు కోల్పోయిందని వారు గుర్తు చేశారు. ఇది ప్రభుత్వం నిర్లక్ష్యమేనని వారు మండిపడ్డారు. వసతి గృహాల్లో భోజన వ్యవస్థను ప్రక్షాళన చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బారు అరవిందు, నరసింహారెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో శుక్రవారం కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయిం చారు. మున్సిపల్ పరిధిలోని 17,7,8,5, వార్డులతో పాటు హనుమాన్ టెంపుల్ తదితర ప్రాంతాల్లో కుక్కలకు యానిమల్స్ సిబ్బంది బంధించి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయిం చారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో కుక్కల వీరంగం పరిస్థితి చేయి దాటి పోతుందని మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లా స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ బాడీ ఎన్నిక

-జిల్లా జనరల్ సెక్రెటరీ నరేష్ పిలుపు



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్‌లో మీడియాతో జిల్లా జనరల్ సెక్రెటరీ నరేష్ మాట్లాడుతూ ఆదివారం 10 గంటలకు పట్టణ కేంద్రంలోని సెంట్ జీవ సెంటెన్స్ స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని జిల్లా ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి స్టేట్ బాడీ నుంచి అప్సర్ హాజరవుతారని సిద్దిపేట జిల్లా స్పోర్ట్స్ అథారిటీ వారికి జిల్లా ఒలంపిక్ సంఘము వారికి తెలిపామన్నారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ సూచనలు మేరకు సమావేశం జరుగుతుందని, సభ్యులు అందరూ తప్పనిసరిగా పాల్గొని జయప్రదం చేయగలరని అన్నారు.

యాసంగిలో లాభసాటిగా పండే పంటలనే పండించాలి

- దుబ్బాక ఏడిఏ మల్లయ్య



నవతెలంగాణ- దౌల్తాబాద్

రైతులు యాసంగి కాలంలో నీటి వసతి తక్కువగా ఉంటుంది కాబట్టి లాభసాటిగా ఉండే పంటలనే పండించాలని దుబ్బాక ఏడిఏ మల్లయ్య అన్నారు. శుక్రవారం దౌల్తాబాద్ మండలం లింగరాజు పల్లి గ్రామంలో మొక్కజొన్న వేరుశనగ పంటలను పరిశీలించి రైతులకు సస్యరక్షణ చర్యలు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కోతలు పూర్తి చేసుకొని రైతులు యాసంగి సాగుకు సిద్దమవుతున్నారు. ఈ నేపథ్యంలో యాసంగిలో తక్కువ నీటితో తక్కువ కాలంలో చేతికచ్చే పెసర, మినుము, బొబ్బర్లు, పొద్దుతిరుగుడు, కుసుమ వంటి పంటల సాగు రైతులకు లాభసాటిగా ఉంటుందని సూచించారు. లింగరాజు పల్లి గ్రామంలో వేరుశనగ పంటను పరిశీలించారు. వేరుశనగ సాగులో మెలుకువలు పాటిస్తే మంచి దిగుబడులు పొందవచ్చని సూచించారు. అనంతరం మొక్కజొన్న పంటను పరిశీలించి మోగి పురుగు నివారణకు తగు సూచనలు చేశారు. ప్రాథమిక దశ గుడ్డు పెట్టే దశలో ఉన్నప్పుడు మీమాయిల్ వేప నూనె 5 ఎం.ఎల్ మందును లీటర్ నీటికి కలిపి స్ప్రే చేయాలి. ఎకరాకు 500 ఎం.ఎల్ వేప నూనె 1500 పిపిఎం మందు ద్రావణం పిచికారి చేయాలి. రెండవ దశ, మూడవ దశలో ఉన్నప్పుడు సైనటోరియం 11.7 ఎస్సీ మందును లేదా క్లోరంత్రనిల్ పోల్ 18.5 ఎస్సీ మందును లేదా థయోమిథాక్సిమ్ 12.6 లాబ్డా సైలోత్రిన్ 9.5 మందును వారం వ్యవధిలో పిచికారి చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు లార్వా పెద్దదిగా ఉన్నప్పుడు విషపు ఏరను తయారు చేసుకోవాలి. 10 కిలోల తవుడును 2 కిలోల బెల్లం పానకంలో 24 గంటలు నానబెట్టిన తర్వాత 100 గ్రాముల థయోడికార్బ్ ద్రావణంను కలిపి మొక్క సుడులలో పడేటట్లు వేసుకోవాలి. ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటే మొక్కజొన్న పంటలను రక్షించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్, వ్యవసాయ విస్తరణ అధికారి సంతోష్ కుమార్, రైతులు సున్నపు లింగం, బోయ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దీక్షా దివస్‌కు తరలి వెళ్లిన బీఆర్ఎస్ శ్రేణులు







నవతెలంగాణ-అక్కన్నపేట

సిద్దిపేట జిల్లా కేంద్రంలో దీక్ష దివస్ ప్రోగ్రాంలో అక్కన్నపేట మండలం రామవరం గ్రామ బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లింగాల శ్రీనివాస్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు ఎడబోయిన మధుసూదన్ రెడ్డి, సీనియర్ నాయకులు సాధుప్రతాప్ రెడ్డి, పొన్న గంగాధర్, లింగాల నర్సింహులు, రిక్కల శ్రీనివాస్ రెడ్డి, బొమ్మ సంపత్, పొన్న ప్రవీణ్, ఎడమల రాజిరెడ్డి, గడ్డమిది సంతోష్, తదితరులు, పాల్గొన్నారు.

నవతెలంగాణ-చేర్యాల

జిల్లా కేంద్రం సిద్దిపేటలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమానికి చేర్యాల పట్టణ, మండల బీఆర్ఎస్ నాయకులు భారీగా తరలి వెళ్లారు. తరలి వెళ్లిన వారిలో మాజీ ఎంపీపీ కరుణాకర్, పార్టీ మండల అధ్యక్షులు అనంతుల మల్లేశం, బీఆర్ఎస్ యూత్ నాలుగు మండలాల ఇంచార్జి శివగారి అంజయ్య బీఆర్ఎస్ వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు యాదవ్,పార్టీ మండల కార్యదర్శి కోతి దాసు తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ-నంగునూరు

సిద్దిపేటలో చేపట్టిన దీక్షా దివస్ నంగునూరు మండలానికి చెందిన బీఆర్ఎస్ అనుబంధ సంఘాల నాయకులు శుక్రవారం తరలి వెళ్లారు. నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో వేయి రోజులు రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ధర్నాలు, వంట వార్పు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ ఉద్యమంలో నంగునూరు మండలం ఎంతో కీలక పాత్ర పోషించారు. ఆనాటి జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ దీక్షా దివస్‌కు తరలి వెళ్లారు. మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

-రామకోటి రామరాజు



నవతెలంగాణ-గజ్వేల్

శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు, రామకోటి రామరాజు జన్మదినం సందర్భంగా శుక్రవారం గజ్వేల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో ఆయనను శాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రభుత్వ దవాఖానలో నిర్వహిస్తున్న అల్పాహార పంపిణి కార్యక్రమం లో ఆయన పాల్గొని అందరికీ పంపిణి చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గత 4 ఏండ్ల నుంచి సేవా చేస్తున్న లయన్స్ క్లబ్ వారిని ప్రత్యేకంగా అభినం దించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు మల్లేశం గౌడ్, నాచారం దేవస్థానం మాజీ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, దొంతుల సత్యనారాయణ, సామజిక కార్యకర్త సాధక్ పాషా, రాము లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా గెలిపించండి ప్రశించే గొంతుకనవుతా..

- పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి మదనం గంగాధర్



నవతెలంగాణ-సిద్దిపేట

టీచర్స్ ఎమ్మెల్సీ ఉన్నట్లుగా న్యాయవాదుల ఎమ్మెల్సీ కూడా ఉండాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి మదనం గంగాధర్ అన్నారు. సిద్దిపేట బార్ అసోసియేషన్‌లో జరిగిన సమావేశంలో గంగాధర్ మాట్లాడారు. చట్టసభల్లో న్యాయవాదులు ప్రముఖ పాత్రలో ఉండాలని విజ్ఞప్తి చేశారు. తనను గెలిపించినట్లయితే మీకోసం నేను న్యాయవాదులకు ఒక ఎమ్మెల్సీ సీటు కోసం పాటుపడతానని వాగ్దానం చేశారు. సమాజంలో విద్యావంతులు వెనుకంజలో ఉన్నారని, సమాజంలో ఉన్న సమస్యలపై పోరాటం జరగడం లేదు అన్నారు. అందుకే ప్రశ్నించే గొంతుకగా మీ ముందుకు వస్తున్నానని చెప్పారు. ఎమ్మెల్సీగా నిలబడుతున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట బార్ జనరల్ సెక్రెటరీ మంతూరి సత్యనారాయణ, న్యాయవాదులు సాయిబాబా, లక్ష్మీనారాయణ, ఆత్మా రాములు, పర్వతం రాములు, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

నల్లూరు శివాలయంలో సీజీఆర్ పూజలు



నవతెలంగాణ-జిన్నారం : మండల పరిధిలోని నల్లూరు శివాలయంలో సంబంధించి బీఆర్ఎస్ రాష్ట్ర నేత సీజీఆర్ ట్రస్ట్ చైర్మెన్ చిమ్ము ల గోవర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ ఉద్యమ నేత జిన్నారం వెంకటేశంగౌడ్‌తో కలిసి నవగ్రహ విగ్రహ ప్రతిష్టాపనకు రూ.30 వేల విరాళాలందించి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఉద్యమ నేత జిన్నారం వెంకటేష్ గౌడ్ , మాజీ సర్పంచులు మాదారం సరిత సురేందర్ గౌడ్, నల్లూరు జనార్ధన్ , కొడకంచి శెట్టి శివరాజ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు

అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు



నవతెలంగాణ-వట్‌పల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ నాయకులు తరచూ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు రమేష్ జోషి, వీర శైవ లింగాయత్ రాష్ట్ర అధ్యక్షులు సంగమేశ్వర్ మండి పడ్డారు. మండల కేంద్రమైన మార్కెట్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. 6 గ్యారంటీ పథకాలతో పాటు అభివృద్ధి పను లపై దృష్టి సారించి ఒదన్నారు. నియోజకవర్గంలో రూ.1000 కోట్లతో అభివృద్ధి పనులను చేపడుతున్న ఘనత మంత్రి దామోదర రాజ నరసింహకే దక్కిం దన్నారు. మరో ఎనిమిది వందల కోట్లతో ఆరు మండలాల్లో 650 ట్యాంకులను నిర్మాణం చేసి ప్రతి గ్రామ వ్యవసాయ రైతుకు సాగునీరు అందించేందుకు ప్రతిపా దనాలను సిద్ధం చేసినట్టు చెప్పారు. కానీ ఈ అభివృద్ధి కార్యక్రమాలను చూడకు ండా.. ప్రభు త్వంపై ఇష్టారీతిని ఆరోపణలు సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రేగోడు పత్రి విట్టల్, మాజీ జెడ్పీటీసీ పాపయ్య, కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు వెంకట్, ఏఎంసీ డైరెక్టర్లు నాగయ్య, హబీబ్ లయన్స్ క్లబ్ కో-ఆర్డినేటర్ పెద్దన్న అధ్యక్షులు మొయినుద్దీన్ నాయకులు సుధాకర్, స్టీఫెన్, రవి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలి



నవతెలంగాణ-రాయపోల్

తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి వెంటనే క్రమబద్ధీకరించాలని ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం రాయపోల్ మండల అధ్యక్షులు మాసాయిపేట యాదగిరి అన్నారు. శుక్రవారం రాయపోల్ మండల కేంద్రంలో మండల విద్యాధికారి సత్యనారాయణ రెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి, నాగరాజులకు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుంచి సమగ్ర శిక్షలో చాలీచాలని వేతనంతో పనిచేస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష ఉద్యోగంలో ఉండి మృతి చెందిన ఉద్యోగులకు ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రూ.5 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమగ్ర శిక్షా ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు ఎల్లా గౌడ్, స్వామి, సమగ్ర శిక్ష ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలపై విమర్శలు మానుకోండి

- బీఆర్ఎస్ గజ్వేల్ ఇంచార్జి ప్రతాప్ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

ప్రభుత్వం అభివృద్ధి చేయకుండా ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తుందని బీఆర్ఎస్‌గజ్వేల్ ఇంచార్జి వంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. శుక్రవారం కేసీఆర్ దీక్ష దివాస్ కార్యక్రమంలో భాగంగా గజ్వేల్ పట్టణంలో తెలంగాణ తల్లి ఉద్యమ వద్ద విలేకరులతో ఆయన మాట్లాడుతూ కేవలం ఏడాదికాలంగా ప్రతిపక్షాలను టార్గెట్ చేసి ముఖ్యమంత్రి, మంత్రులు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. అభివృద్ధిపై సూచనలు సలహాలు ఇవ్వమని చెప్తూనే ఇస్తే కేసులు పెడతాం బెదిరిస్తున్నారని విమర్శించారు. అభివృద్ధిని వదిలి ఇతర పార్టీలపై విమర్శలు దిగితే సహించేది లేదని ఆయన చెప్పారు. దీక్ష దివాస్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి, వైస్ చైర్మెన్ జాకీర్ పలువురు కౌన్సిల్ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు తొలగింపు



నవతెలంగాణ- రాయపోల్

ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వాటిని తొలగించినందుకు రెవెన్యూ పోలీస్ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు రాయపోల్ బీజేపీ మండల అధ్యక్షులు రాజా గౌడ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలో రామారం గ్రామ శివారులో ప్రభుత్వం భూమిలో అక్రమ నిర్మాణాలను తొలగించిన ప్రదేశాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయపోల్ మండల పరిధిలో రామారం గ్రామ శివారులో సర్వే నంబర్ 481 లో గల 2.30 ఎకరాల ప్రభుత్వ భూమిలో రెండున్నర ఎకరాల ప్రభుత్వ భూమిలో అనుమతి లేకుండా దర్గా నిర్మాణం చేపట్టడంపై రాయపోల్ తహసీల్దార్ కార్యాలయంలో, పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా వారు జిల్లా అధికారులను సంప్రదించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి అలాంటి అక్రమ నిర్మాణాలను తొలగించిప్రభుత్వ భూమిని కాపాడడం జరిగింది. వెంటనే స్పందించిన ప్రభుత్వ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల మండల ప్రధాన కార్యదర్శి నీల స్వామి,మాజీ వైస్ ఎంపీపీ చెరుకు రాజిరెడ్డి, నామసాని స్వామి, అంతన్నగారి గణేష్, నాయిని రాజిరెడ్డి, పిట్ల నర్సింలు, ప్రవీణ్ గౌడ్, చందు, రవి, పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి సీఎం దృష్టి

- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి నేరుగా సీఎం రేవంత్ రెడ్డి వచ్చి వారి సమస్యలు అడిగి తెలుసుకుంటారని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిసెంబర్ నెలలో సీఎం పర్యటనలు భాగంగా అనేక సమస్యలను ఆయన దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేందుకు కార్యచరణ ప్రారంబిస్తున్నట్లు చెప్పారు. మల్లన్న సాగర్ నిర్వాసితులతో పాటు గజ్వేల్ రింగ్ రోడ్డు, కోట మైసమ్మ రోడ్డు తదితర పెండింగ్ పనుల విషయాన్ని ఆయన దృష్టికి తీసుకుపోతామని చెప్పారు. ఉపాధి హామీ పథకం కింద గజ్వేల్ నియోజకవర్గంలో 9 మండలాలకు.రూ 9 కోట్ల మంజూరు చేసినట్లు చెప్పారు. వీటి ద్వారా గ్రామాల్లో సీసీ రోడ్లు ఇతర పనులను చేపడతారని ఆయన పేర్కొన్నారు. అనంతరం గజ్వేల్ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు గాడి పల్లి శ్రీనివాస్ ఇంటిలో రివా ఇంజనీరింగ్ సెక్షన్ ప్రైవేట్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందరికీ ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించడం సాధ్యం కాదని తమకు వచ్చిన విద్యతో ఉపాధి పొందేందుకు మార్గాలు ఎంచుకోవాలన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో ఉపాధి మార్గాల కోసం యువత ముందుకు సాగాలని వారి కాళ్లపై వారే నిలబడి ఉపాధి పొందేలా శిక్షణ పొందాలన్నారు. అలాగే రివా ఇంజనీర్ సెక్షన్ కార్యాలయం సైతం మంచి డిజైన్ ఇచ్చి మెరుగైన సూచన సలహాలు ఇచ్చేలా ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ నరేందర్ రెడ్డి,వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మెన్ గాడి పల్లి భాస్కర్, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, వెంకట నరసింహారెడ్డి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మారెడ్డి, నక్క రేగొండ, వహీద్,జహీర్, మతి, గాడి పల్లి శ్రీనివాస్, రమేష్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

కుంకుమార్చనకు తరలివచ్చిన మహిళా భక్తులు




నవతెలంగాణ-రామచంద్రాపురం

భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజి కాలనీలో గల కమ్యూనిటీ హాల్లో మూడ్రోజుల పాటు నిర్వహించతలపెట్టిన కార్తిక మహోత్సవ వేడుకలను శుక్రవారం ఉదయం వేద మంత్రోచ్చరణల మధ్య ప్రారంభించారు. ప్రారంభ వేడుకలకు పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విచ్చేసి ప్రత్యేక పూజా కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లోక కళ్యాణార్థం దైవ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అనంతరం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసం తోషాలతో ఉండాలని కాంక్షిస్తూ కార్తీకోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనంద దాయకమని నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను ఆశీర్వదించి, సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

కన్నుల పండుగగా శోభాయాత్ర..

కార్తీక మహోత్సవాలను పురస్కరించుకొని గురువారం సాయంత్రం నిర్వహించిన శోభాయాత్ర కన్నుల పండుగగా సాగింది. ఎల్ఐజి బస్టాండ్ దగ్గర నుంచి ప్రారంభమైన శోభాయాత్ర కాలనీలోని కమ్యూనిటీ హాల్ వరకు సాగింది. శుభ యాత్రను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆదర్శ్ రెడ్డి ప్రారంభిం చారు. కాలనీలోని పురవీధుల గుండా కొనసాగిన ఈ యాత్రలో కాలనీ సొసైటీ అధ్యక్షులు యాదగిరి రెడ్డి, డైరెక్టర్లు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.


పనులను పరిశీలించిన చైర్ పర్సన్



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ పురపాలక సంఘ పరిధిలో పట్టణ ప్రజల సేవకై, ఆరోగ్యమే ప్రథమ విధిగా భావిస్తూ 16వ వార్డులోని 1వ కల్లు కాంపౌండ్ దగ్గర డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని 16వ వార్డు డ్రైనేజీ సరిగ్గా లేక అనేక సంవత్సరాలుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రజల సౌకర్యార్థం కొత్త డ్రైనేజీ పనులను, అలాగే 15వ వార్డులో ప్రజల కోరిక మేరకు డ్రైనేజీ పై కప్పును పనులను ,16 వ వార్డులో కొత్త సిసి రోడ్ పనులను తూప్రాన్ మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ముదిరాజ్ పరిశీలించారు.పట్టణంలో నూతనంగా చేపట్టిన అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా పనులను చేపట్టాలని కాంట్రాక్టర్ కు సూచించారు. మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి, కౌన్సిలర్లు పల్లెర్ల జ్యోతి రవీంద్ర గుప్తా,శ్రీశైలం గౌడ్, మున్సిపల్ ఏఈ శ్రీకాంత్,కాంగ్రెస్ నాయకులు ఉమర్,మాలే కుమార్,కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కానీ రైతులకు త్వరలోనే మాఫీ



నవతెలంగాణ - వెల్దుర్తి

రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేసిందని రుణమాఫీ కానీ రైతులకు కూడా త్వరలోనే పూర్తిగా మాఫి చేయడానికి సమయతమవుతుందని పిఏసిఎస్ సీఈవో సిద్దయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పిఏసిఎస్ కార్యాలయం ముందు సీఈఓ సిద్దయ్య ఆధ్వర్యంలో రైతు పండుగ సందర్భంగా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న రైతు సంక్షేమ పథకాలను వివరించారు. ధాన్యం కొనుగోలు ముమ్మరంగా చేపట్టడం జరిగింది అన్నారు. చాలా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు పూర్తి అయిందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యముకు సంబంధించిన డబ్బులు వెంట వెంటనే రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. యాసంగి సీజన్ కు రైతులకు సరిపడా విత్తనాలను ఫర్టిలైజర్ ను అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ సిబ్బంది ఉన్నారు.